స్కాన్ చేయండి

www.vaarthavedhikasurya.com

PRGI NO:- TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 2 | సంచిక: 151 | సోమవారం, అక్టోబర్ 19, 2026 | ఎడిటర్: పోలోజు శ్రీనివాసచారి | పేజీలు: 12 | వెల: 5-00 |
|---|---|---|---|---|---|---|
| YADADRI BHUVANAGIRI | VOLUME : 2 | ISSUE : 151 | MONDAY, OCTOBAR 19, 2026 | EDITOR : POLOJU SRINIVASA CHARY | PAGES : 12 | RS : 5-00 |


## నేడు ఫ్యూచర్ సిటీకి సీఎం రేవంత్

- పోలీస్ కమిషనరేట్ ప్రారంభోత్సవం..
- ఎన్ఐయుఎం క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన



2



# అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు
- ట్యాంక్‌బండ్‌పై 700 మంది కళాకారుల ప్రదర్శనల నడుమ హోరెత్తిన ఉత్సవం
- బతుకమ్మ ఆడిన గవర్నర్ సతీమణి జానకి, మంత్రి సీతక్క, సినీనటులు రష్మిక, విజయ్
- బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనాలని పెళ్లప్పుడే ర ష్మికకు చెప్పా.. తీసుకొచ్చా: విజయ్
- నేను తెలంగాణ కోడలిని.. అందుకే బతుకమ్మ ఆడేందుకు వచ్చా: రష్మిక
- కులమతాలకు అతీతంగా ప్రజలను ఒకచోటకు చేర్చే పండుగ: మంత్రి జూపల్లి

హైదరాబాద్, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):

సూర్యుడు పడమట వాలుతుండగా ఆ నారింజ రంగుతో కూడిన చల్లని హాయి అయిన మలిసంధ్యకు మరింత అందాన్ని తెచ్చేలా.. తీరొక్క రంగులతో బతుకమ్మలు ఇళ్లలోంచి వీధుల్లోకొచ్చి ఓ చోట చక్కగా అలికి పరిచిన ముగ్గులపై కొలువుతీరాయి. వాటి చుట్టూ పట్టు పరికిణీలు, పట్టు చీరల్లో నగల ధగధగలు, గాజుల గలగలతో యువతులు, మహిళలు చేరి ఆడి పాడారు. ఉయ్యాలో ఉయ్యాల అంటూ వారు అందుకున్న పాటలకు, కోలాటాల సందడికి, డీజేల మోతకు వీధులు హోరెత్తిపోయాయి. చీకట్లు కమ్ముకుంటుండగా మహిళలంతా బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేసి.. ఒడ్డున కూర్చుని సద్దులు తిని.. పాటలు పాడుకుంటూ ఇళ్లకు కదిలారు. ఆదివారం సాయంత్రం రాష్ట్రవ్యాప్తంగా పల్లె, పట్నం అన్న తేడా లేకుండా ఇలా సంప్రదాయరీతిలో సద్దుల బతుకమ్మ సంబురాలు కన్నుల పండుగగా జరిగాయి! ప్రభుత్వ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై పెద్ద బతుకమ్మ వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. విద్యుద్దీపాల అలంకరణల నడుమ పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యకారులు సహా 700 మంది కళాకారుల ప్రదర్శనలు, హుస్సేన్ సాగర్ అలలపై లేజర్ షో, తారాజువ్వలు దూసుకెళ్లడాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మిగతా 2లో..









# అమరజ్యోతి ప్రాంగణంలో బతుకమ్మ పేర్చిన సీతక్క

- మహిళలతో కలిసి బతుకమ్మ పాటలు
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ఘన నివాళి



హైదరాబాద్, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకల్లో మంత్రి సీతక్క ఉత్సాహంగా పాల్గొన్నారు. సచివాలయం సమీపంలోని అమరజ్యోతి ప్రాంగణంలో మహిళలతో కలిసి తీరొక్క పూలతో బతుకమ్మను అందంగా పేర్చారు. బతుకమ్మ పాటలు పాడుతూ మహిళలతో మమేకమై పండుగ సందడిని పంచుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, మహిళల ఐక్యతకు, ప్రకృతితో మమేకమైన జీవనశైలికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు. పూలను వరుసగా అందంగా పేర్చి బతుకమ్మను సిద్ధం చేసిన మంత్రి సీతక్కతో మహిళలు కలిసి పాటలు పాడటంతో అమరజ్యోతి ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. అంతకుముందు ప్రజాభవన్‌లోని తన నివాసంలోనూ కాంగ్రెస్ మహిళా నాయకులు, వ్యక్తిగత సిబ్బందితో కలిసి సీతక్క బతుకమ్మను పేర్చారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెప్పే ఈ వేడుకల్లో ఆమె పాల్గొనడం మహిళల్లో ఉత్సాహాన్ని నింపింది.

# పండుగ వేళ ఛార్జీల బాదుడా?

- జర్మనీ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల మోసం!
- టికెట్ ధరలు తగ్గించాలి.. టామ్‌కామ్ బాధితులకు న్యాయం చేయాలి
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు

హైదరాబాద్, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):

బతుకమ్మ, దసరా పండుగల వేళ ఆర్టీసీ టికెట్ ఛార్జీలను పెంచి ప్రజలపై అదనపు భారం మోపుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభ ఉపనేత హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మరోవైపు, జర్మనీలో ఉద్యోగాల పేరుతో ప్రభుత్వ రంగ సంస్థ టామ్‌కామ్ ద్వారా నిరుద్యోగ యువతను మోసం చేశారని ఆరోపించారు. పండుగ ఛార్జీలను తగ్గించడంతోపాటు విదేశీ ఉద్యోగాల కోసం డబ్బులు చెల్లించి ఇబ్బందులు పడుతున్న యువతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

### పండుగల పేరుతో డబుల్ ఛార్జీల వసూళ్లు

పండుగల సమయంలో ప్రజలకు ఊరట కల్పించాల్సింది పోయి ప్రత్యేక బస్సుల పేరుతో టికెట్ ధరలను పెంచడం సరికాదని హరీశ్‌రావు అన్నారు. సాధారణ బస్సులను తగ్గించి, ఉన్న బస్సులకే ప్రత్యేక బస్సుల బోర్డులు తగిలించి ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలు మిగతా 2లో..





## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వేతనాల్లో కోతలు అన్యాయం

- కేంద్రం నిధులిస్తున్నా జీతాలు తగ్గించడం సరికాదు
- ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి..
- లేదంటే ప్రజా ఉద్యమం చేపడతాం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

2లో..

# మహాశక్తి ఆలయంలో పొన్నం ప్రత్యేక పూజలు

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో కలిసి దర్శనం
- రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలని ప్రార్థన



హైదరాబాద్ అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):

శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కరీంనగర్‌లోని శ్రీ మహాశక్తి ఆలయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ దుర్గాదేవి రూపంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థించారు. తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలతో తెలంగాణ సుభిక్షంగా వర్ధిల్లాలని మిగతా 2లో..




www.vaarthavedikasurya.com వార్త వేదిక సూర్య తెలుగు దినపత్రిక VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY సంపుటి:2 | సంచిక: 151 సోమవారం 19 అక్టోబర్, 2026

## సొంతూరికి చలో చలో!

### విజయదశమికి సొంతూళ్లకు బయలుదేరిన హైదరాబాదీలు

### ప్రయాణికులతో బస్టాండ్‌లు, వాహనాలతో హైవేలు కిటకిట

చౌటుప్పల్, (వార్త వేదిక సూర్య):

రాష్ట్రంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి పొట్టకూటి కోసం హైదరాబాద్ వచ్చిన వారిలో చాలా మంది దసరా పండగకి సొంతూళ్లకు బయలుదేరారు. పాఠశాలలకు సెలవు దినాలు మొదలైనప్పటి నుంచి పెరిగిన పండగ ప్రయాణాలు.. శనివారం నుంచి మరింత ఊపందుకున్నాయి. రాష్ట్రంలోని స్వగ్రామాలకు వెళ్లేవారితోపాటు ఏపీలోని సొంతూళ్లకు వెళ్లేవారితో బస్టాండ్‌లు, కార్లు, బస్సులతో జాతీయ రహదారులు ఆదివారం కిటకిటలాడాయి. ముఖ్యంగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ఆదివారం చాలా రద్దీగా మారింది. సాధారణ రోజుల్లో చౌటుప్పల్ మండలంలోని పంతంగి టోల్‌గేట్ నుంచి 38 వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే ఆదివారం ఈ సంఖ్య 51 వేలు దాటింది. దీంతో చౌటుప్పల్‌లోనూ వాహన రద్దీ కనిపించింది. చౌటుప్పల్ మీదుగా విజయవాడ వైపు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా కార్ల దారి మళ్లింపు కొనసాగుతోంది. మరోపక్క, యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని హైదరాబాద్-భూపాలపల్లి 163వ జాతీయ రహదారి కూడా ఆదివారం కిటకిటలాడింది. వరంగల్ హైవేపై వాహనాల రద్దీ పెరగ్గా... బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరి కనిపించాయి. కాగా, పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జూబ్లీ బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్‌లు ఆదివారం కిక్కిరిశాయి. రద్దీకి తగినట్లు బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం ఎదురు చూశారు. హైదరాబాద్ నుంచి వెయ్యికి పైగా సిటీ బస్సులను జిల్లాలకు పంపించారు. ఆదివారం రాత్రి 8 గంటల వరకు రెగ్యులర్ సర్వీసులతో పాటు వెయ్యికి పైగా ప్రత్యేక సర్వీసులను ఏపీ, తెలంగాణ జిల్లాలకు నడిపినట్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు తెలిపారు. అయితే, గ్రామీణ ప్రాంతాల సర్వీసులను ప్రత్యేక బస్సులుగా నగరాలు, ప్రధాన మార్గాలకే పరిమితం చేయడంతో గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులు లేకుండా పోతున్నాయి. భువనగిరి, యాదగిరిగుట్ట, చౌటుప్పల్ వంటి పట్టణాల బస్టాండ్‌ల నుంచి పల్లెలకు వెళ్లే బస్సులు లేక ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వేతనాల్లో కోతలు అన్యాయం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల వేతనాల్లో కోతలు విధిస్తూ ప్రభుత్వం జీవో 1195 తీసుకురావడం అన్యాయమని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 17 వేల మంది ఉద్యోగుల్లో కొందరి వేతనాలను రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు తగ్గించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జేఏసీ నాయకులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. ఒకవైపు నిత్యావసర వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతుంటే ఉద్యోగుల జీతాలను తగ్గించడం ఏమిటని కవిత ప్రశ్నించారు. కొందరి వేతనాలు పెంచి, మరికొందరి జీతాలు తగ్గించడం వివక్ష కాదా అని నిలదీశారు. ఉద్యోగుల వేతనాల కోసం కేంద్రం నిధులు అందిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో జీతాలు చెల్లించడం లేదని ఆరోపించారు. ఏటా ఐదు శాతం వేతన పెంపు నిబంధనలు ఉన్నాయని పేర్కొంటూ, కోతలు విధించడం సరికాదన్నారు.

**ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి**

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు వారికి న్యాయం చేయడం లేదని కవిత విమర్శించారు. దేశంలోని ఏడు రాష్ట్రాల్లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారని, వాటిలో కాంగ్రెస్ పాలనలో ఉన్న హిమాచల్‌ప్రదేశ్ కూడా ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగుల వేతనాలను 30 శాతం పెంచడంతోపాటు రెగ్యులరైజేషన్ కోసం అసెంబ్లీలో తీర్మానం చేశారని గుర్తుచేశారు. తెలంగాణలో ఉద్యోగులకు అందాల్సిన నిధులు పక్కదారి పడుతున్నాయని ఆరోపిస్తూ, అందరి వేతనాలు పెంచి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పాత్ర కీలకమని కవిత పేర్కొన్నారు. టీకాల కార్యక్రమాలతోపాటు ప్రజలకు స్థానికంగా వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. ఈ ఉద్యోగులు ఒక్కరోజు విధులకు దూరమైనా గ్రామీణ ఆరోగ్య వ్యవస్థపై ప్రభావం పడుతుందని హెచ్చరించారు. వేతనాల కోతలపై ధర్నాకు అనుమతి ఇవ్వకపోవడం, వైద్యారోగ్య శాఖ మంత్రి ఉద్యోగులకు అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి, వేతనాల అంశంపై సమీక్ష నిర్వహించాలని కోరారు. వైద్యారోగ్య శాఖ మంత్రికి ఆదేశాలిచ్చి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల తరఫున పెద్దఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని కవిత హెచ్చరించారు.





# అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

(మొదటి పేజీ తరువాయి)

వేడుకలకు గవర్నర్ శివప్రసాద్ శుక్లా, ఆయన సతీమణి జానకీ శుక్లా, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి, మరోమంత్రి సీతక్క, ప్రముఖ సినీనటులు, కొత్త దంపతులు అయిన విజయ దేవరకొండ, రష్మిక, సినీ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ తదితరులు వేడుకకు హాజరయ్యారు. ఎల్‌నినో కారణంగా రాష్ట్ర ప్రభుత్వం చేసిన సూచనలను ప్రజలు, రైతులు తప్పకుండా పాటించాలని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. నీటిని, విద్యుత్తును పొదుపుగా వాడుకోవాలని సూచించారు. రంగురంగుల పూలను ఒకచోటకు చేర్చి.. ఆ పూలతోనే అమ్మవారిని కొలిచే గొప్ప పండుగ.. కుల, మతాలకు అతీతంగా ప్రజలందరినీ ఒక చోటకు చేర్చి ఐకమత్యంగా ఉండాలనే సందేశాన్నిచ్చే వేడుక బతుకమ్మ అని జూపల్లి పేర్కొన్నారు. చెరువులు, చేలను పరిరక్షించుకోవాలనే సందేశాన్నిచ్చే పండుగ బతుకమ్మ అని సీతక్క అన్నారు. బతుకమ్మ ఆడటం ద్వారా ఆరోగ్యం బాగుంటుందని, ఆ రకంగా ఇది ఆరోగ్యాన్ని పరిరక్షించే పండుగ అని వివరించారు. అనంతరం విజయ్ దేవరకొండ మాట్లాడారు. తనకు తెలంగాణ పండుగలు అంటే ఎంతో ఇష్టం అని.. అందులోనూ బోనాలు, బతుకమ్మ పండుగలంటే మరీ ఇష్టం అని చెప్పారు. ఫిబ్రవరిలో తమకు వివాహం జరిగిందని, తెలంగాణ పండుగల్లో ఒకటైన పెద్ద బతుకమ్మ పండగ ఎక్కడ జరిగితే అక్కడ బతుకమ్మ ఆడాలని రష్మికకు అప్పట్లోనే తాను చెప్పానని వెల్లడించారు. ఆ ప్రకారంగానే రష్మికను ట్యాంక్‌బండ్‌పై వేడుకల్లో బతుకమ్మను ఆడించేందుకు తీసుకొచ్చానని చెప్పారు.

అనంతరం రష్మిక మాట్లాడారు. తాను తెలంగాణ కోడలినని, ఆ రకంగా రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాల్లో పాలు పంచుకోవడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. పెళ్లయ్యాక.. తెలంగాణలో జరిగే అతిపెద్ద బతుకమ్మ పండగలో పాల్గొని బతుకమ్మ ఆడాలని విజయ్ తనకు చెప్పారని అందుకే ఈ బతుకమ్మ ఉత్సవాలకు తాను హాజరయ్యానని చెప్పారు. అప్పట్లో తనను అంతా మేడం అని పిలిచేవారని, తెలంగాణ కోడలినయ్యాక అంతా వదినా అని పిలుస్తున్నారని.. తన పట్ల ఈ అభిమానం ఎప్పటికీ ఇలానే ఉండాలని పేర్కొన్నారు. గవర్నర్ సతీమణి జానకీ శుక్లా, మంత్రి సీతక్క, రష్మిక బతుకమ్మ ఆడారు. హనుమకొండలో పద్మాక్షి ఆలయం వద్ద జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో వేలసంఖ్యలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వరంగల్‌లోని పోతన ఆడిటోరియం, ప్రసిద్ధ భద్రకాళి ఆలయ ప్రాంగణం, ఉర్సు కరీమాబాద్‌లోని రంగలీలా మైదానం, వరంగల్ కోట, కాజీపేటలోని వడ్డెపల్లి చెరువుకట్ట, కాశీబుగ్గలోని కోటి లింగాల దేవాలయ ప్రాంగణం వద్దా బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మాజీ మంత్రి కొండా సురేఖ హనుమకొండ రాంనగర్‌లో జరిగిన బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన వేడుకలకు మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. నిజామాబాద్ జిల్లా బోర్గాంలో బతుకమ్మ ఆడుతుండగా ఆ వైపు అంబులెన్స్ రావడంతో మహిళలు బతుకమ్మలను పక్కకు తీసి అంబులెన్స్‌కు దారి ఇచ్చి తమ బాధ్యతను చాటుకున్నారు.

**పెరికసింగారంలో 55 అడుగుల బతుకమ్మ..**

ఖమ్మం జిల్లా ప్రజలు. కూసుమంచి మండలం పెరికశింగారం గ్రామంలో 55 అడుగుల భారీ బతుకమ్మను పేర్చారు. గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ జూకూరి గోపాలరావు- విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఈ అతి పెద్ద బతుకమ్మను తీర్చిదిద్దారు. ఈ బతుకమ్మ పేర్చడానికి నాలుగు క్వింటాళ్ల పూలు అవసరమయ్యాయి. 25 మంది పదిగంటల పాటు శ్రమించి బతుకమ్మను సిద్ధం చేశారు. గత 25 ఏళ్లుగా ఇక్కడ భారీ ఎత్తుతో బతుకమ్మను పేర్చడం ఆనవాయితీగా వస్తోంది. కాగా కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం తిప్పాపూర్‌లో బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా విషాద ఘటన జరిగింది. ధర్మగల్ల స్వామి (40) అనే ఆర్టీసీ డ్రైవర్ కుటుంబసభ్యులతో కలిసి బతుకమ్మ వేడుకలకు హాజరయ్యాడు. బతుకమ్మను నిమజ్జనం చేస్తుండగా కాలు జారడంతో స్వామి నీళ్లలో మునిగిపోయాడు. కొద్దిసేపటికి అతడిని నీళ్లలోంచి బయటకు తీయగా అప్పగికే మృతిచెందాడు. స్వామికి భార్య శ్యామల, కుమార్తె, కుమారుడు, తల్లిదండ్రులు ఉన్నారు.

# ఆలయాల అభివృద్ధికి రూ.2,500 కోట్లు

- భద్రాచలం దేవస్థానానికి రూ.276 కోట్లు.. బాసర ఆలయానికి రూ.354 కోట్లు
- నాచారం అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.44 కోట్లతో రహదారి
- ప్రజా సంక్షేమమే మా అజెండా..
- ప్రతి కుటుంబం బాగుండటమే లక్ష్యం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):





రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గం ఏన్కూరు మండలం నాచారంలోని అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్న ఆయన, ఆలయానికి వెళ్లే రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. భవిష్యత్తులో ఈ ఆలయానికి లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రూ.44 కోట్లతో రహదారి నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ పట్టుదలతో నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. రహదారి నిర్మాణంతో భక్తులకు సౌకర్యం కలగడంతోపాటు స్థానికంగా వ్యాపారాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి సుమారు రూ.2,500 కోట్లతో పనులు చేపడుతున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాలు, అక్కడి ఆలయాల అభివృద్ధికి రూ.2,000 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడించారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రూ.276 కోట్లు, బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ అభివృద్ధికి రూ.354 కోట్లు కేటాయించినట్లు వివరించారు.

**సంక్షేమ పథకాలతో పేదలకు భరోసా**

ప్రతి కుటుంబం బాగుండటమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో 1.06 కోట్ల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం, 71 లక్షల మంది రైతులకు రైతు భరోసా, 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు వడ్డీలేని రుణాలు, అర్హులకు సామాజిక భద్రత పింఛన్లు, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు అల్పాహార పథకం అమలు చేస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. గురుకుల పాఠశాలల్లో డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మోటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు చెప్పారు. ప్రతి నియోజకవర్గంలో సుమారు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలను నిర్మిస్తున్నామని, వైరా నియోజకవర్గానికి కూడా ఈ పాఠశాలను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి అధునాతన సాంకేతిక శిక్షణ కేంద్రాన్ని కూడా కేటాయించామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి ప్రపంచంతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

**రహదారుల అభివృద్ధికి రూ.90 వేల కోట్లు**

రాష్ట్రంలో రహదారుల నిర్మాణం, అభివృద్ధికి సుమారు రూ.90 వేల కోట్లతో పనులు చేపడుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విద్యుత్ డిమాండ్ 20 వేల మెగావాట్లకు పైగా పెరిగినా నిరంతర సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత పదేళ్లలో రాష్ట్రంపై సుమారు రూ.8.20 లక్షల కోట్ల అప్పుల భారం పడిందని, ప్రస్తుతం అసలు, వడ్డీల చెల్లింపులకు ప్రతి నెలా సుమారు రూ.6,600 కోట్లు వెచ్చించాల్సి వస్తోందని పేర్కొన్నారు. అయినప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని భట్టి విక్రమార్క హెచ్చరించారు. తాగునీటితోపాటు పశువులు, పక్షుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించాలని ప్రజలకు సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని గమనించి మోటార్లను వినియోగించాలని రైతులను కోరారు. నీటి పొదుపుపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణుల సూచనల మేరకు ప్రజలకు పరిస్థితులను వివరించాలని పేర్కొన్నారు. వైరా నియోజకవర్గ అభివృద్ధికి ఇప్పటికే పలు రహదారులు మంజూరు చేశామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. నాచారం నుంచి జూలూరుపాడు మీదుగా తల్లాడ–భద్రాచలం ప్రధాన రహదారిని కలిపేలా గన్నవరం, నాచారం, భద్రతండా ప్రాంతాలకు ఉపయోగపడే మరో బీటీ రహదారిని మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చి వారి జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అధ్యక్షత వహించగా, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఫ్యూచర్ సిటీకి సీఎం రేవంత్

హైదరాబాద్, అక్టోబరు 18 (వార్త వేదిక సూర్య):

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం ఫ్యూచర్ సిటీకి వెళ్లనున్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఫ్యూచర్‌సిటీ పోలీస్ కమిషనరేట్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. ఆ తరువాత యాచారం మండలం మంగలితండా వద్ద నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐయుఎం) క్యాంపస్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని సందర్శిస్తారు. ఆ ప్రాంగణంలోనే నిర్వహించబోయే ఇన్వెస్ట్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడనున్నారు. అక్కడి నుంచి ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయానికి చేరుకుని పనులపై సమీక్షించనున్నారు.



## మహాశక్తి ఆలయంలో అమ్మవార్లకు మంత్రి పొన్నం ప్రత్యేక పూజలు

(మొదటి పేజీ తరువాయి)

అమ్మవారిని వేడుకున్నారు. ప్రజాపాలన ప్రభుత్వంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి అవరోధాలు లేకుండా విజయవంతంగా కొనసాగాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## పండుగ వేళ ఆర్టీసీ ఛార్జీల బాదుడా?

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని ఆరోపించారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు సాధారణంగా రూ.230 ఉన్న టికెట్ ధరను రూ.400కు పెంచారని, మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు గతంలో రూ.220గా ఉన్న ఛార్జీని రూ.290కు పైగా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పలు మార్గాల్లో ఛార్జీలు పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపుతున్నారని విమర్శించారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తూనే పురుషుల నుంచి అధిక ఛార్జీలు వసూలు చేయడం వల్ల కుటుంబాలపై అదనపు భారం పడుతోందని అన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పాలనలో ఆర్టీసీ ఛార్జీలను పలుమార్లు పెంచారని ఆరోపిస్తూ, పండుగల పేరుతో పెంచిన ఛార్జీలను వెంటనే తగ్గించాలని, సాధారణ బస్సులను యథావిధిగా నడపాలని డిమాండ్ చేశారు.

**జర్మనీ ఉద్యోగాల పేరుతో యువతకు అన్యాయం**

జర్మనీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి టామ్‌కామ్ ద్వారా 15 జిల్లాలకు చెందిన 75 మంది నిరుద్యోగుల నుంచి వీసాలు, పరీక్షల పేరుతో ఒక్కొక్కరి వద్ద సుమారు రూ.4.5 లక్షలు వసూలు చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. రెండేళ్లు గడిచినా ఒక్క అభ్యర్థికీ జర్మనీ కంపెనీతో కనీసం ఇంటర్వ్యూ కూడా నిర్వహించలేదని విమర్శించారు. ప్రభుత్వం చెప్పిన మాటలు నమ్మి కొందరు కుటుంబ సభ్యుల బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారని, వాటికి ఇప్పటికీ వడ్డీలు చెల్లిస్తూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బీ1 భాషా పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి మళ్లీ బీ2 పరీక్ష పేరుతో నిబంధనలు విధిస్తున్నారని ఆరోపించారు. తొమ్మిది మందిని జర్మనీకి పంపుతున్నట్లు ప్రచారం చేసినప్పటికీ, చివరకు ఒక్కరినీ పంపలేదని విమర్శించారు. సమస్యలపై న్యాయపోరాటం చేయాల్సి వస్తే సుమారు వెయ్యి కిలోమీటర్ల దూరంలోని లక్నో కోర్టును ఆశ్రయించాల్సి వచ్చేలా అభ్యర్థులతో ఒప్పందాలపై సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు. టామ్‌కామ్ ద్వారా విదేశాల్లో ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారనే వివరాలను సమాచార హక్కు చట్టం కింద కోరినా ప్రభుత్వం సమాధానం ఇవ్వలేదని అన్నారు.

**బాధితులకు పరిహారం చెల్లించాలి**

టామ్‌కామ్ వసూలు చేసిన మొత్తాన్ని బాధితులకు వెంటనే తిరిగి చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రెండేళ్ల విలువైన సమయాన్ని కోల్పోవడం, అప్పులపై వడ్డీలు చెల్లించడం, మానసిక ఒత్తిడికి గురికావడం వంటి నష్టాలకు పరిహారం అందించాలని కోరారు. బాధితులందరికీ ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలని సూచించారు. టామ్‌కామ్ వ్యవహారంపై సీఐడీ లేదా న్యాయ విచారణ జరిపించి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు ఎంత ఫీజు వసూలు చేశారు, ఎంతమందికి విదేశీ ఉద్యోగాలు కల్పించారు అనే వివరాలతో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాల హామీ, ప్రకటించిన ఉద్యోగ క్యాలెండర్ అమలు ఏమైందని హరీశ్‌రావు ప్రశ్నించారు. నిరుద్యోగ కుటుంబాలకు న్యాయం జరిగే వరకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా నిలిచి పోరాడుతుందని ప్రకటించారు.

# కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ‘వెలుగు’ కథనం

- 24 గంటల్లో క్షమాపణ చెప్పాలి
- ‘కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లిన కొండపోచమ్మ’ కథనంపై బీఆర్‌ఎస్ లీగల్ సెల్ నోటీసులు
- మొదటి పేజీతోపాటు డిజిటల్ వేదికల్లోనూ క్షమాపణ ప్రచురించాలని డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):

బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రతిష్ఠను దెబ్బతీసేలా, రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టులపై ప్రజల్లో అపోహలు సృష్టించేలా ‘వెలుగు’ దినపత్రిక తప్పుడు కథనాన్ని ప్రచురించిందని భారత రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండించింది. అక్టోబర్ 17న మొదటి పేజీలో ప్రచురించిన ‘కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లిన కొండపోచమ్మ’ కథనాన్ని 24 గంటల్లో ఉపసంహరించుకొని, బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు బీఆర్‌ఎస్ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌ఛార్జ్ సోమ భరత్ కుమార్ ‘వెలుగు’ యాజమాన్యానికి, ఎడిటర్‌కు నోటీసులు జారీ చేశారు.

**కథనానికి ఆధారాలేమిటి?**

యాదాద్రి భువనగిరి జిల్లా సాగునీటి అవసరాలు, కొండపోచమ్మ సాగర్, కాలువల మార్గాలను కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంతో ముడిపెడుతూ కథనం ప్రచురించడంపై బీఆర్‌ఎస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. సాగునీటి శాఖ రికార్డులను పరిశీలించారా? కాలువల వాస్తవ మార్గాలను ధ్రువీకరించారా? సంబంధిత అధికారుల నుంచి వివరణ తీసుకున్నారా? అనే ప్రశ్నలకు సమాధానాలు లేకుండా సంచలనాత్మక శీర్షికలతో ఆరోపణలు చేయడం జర్నలిజం ప్రమాణాలకు విరుద్ధమని పార్టీ పేర్కొంది. కేసీఆర్ పేరును ఉపయోగించుకొని వివాదాలు సృష్టించడం, బీఆర్‌ఎస్‌పై బురదజల్లడం, గత ప్రభుత్వం నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులను అప్రతిష్ఠపాలు చేయడం ద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించింది. పత్రికా స్వేచ్ఛను బీఆర్‌ఎస్ గౌరవిస్తుందని, ప్రభుత్వాలను, రాజకీయ నాయకులను ప్రశ్నించే హక్కును సమర్థిస్తుందని పార్టీ తెలిపింది. అయితే వ్యక్తుల ప్రతిష్ఠను దెబ్బతీసే ఆరోపణలకు తగిన ఆధారాలు ఉండాలని స్పష్టం చేసింది. సాగునీటి ప్రాజెక్టులపై వాస్తవాల ఆధారంగా చర్చించాల్సింది పోయి, రాజకీయ ప్రయోజనాల కోసం వార్తలను వక్రీకరించడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించింది. నోటీసులు అందిన 24 గంటల్లోగా వివాదాస్పద కథనాన్ని ఉపసంహరించుకోవాలని, ఆరోపణలకు ఆధారాలతో కూడిన వివరణ ఇవ్వాలని, కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీకి బేషరతుగా క్షమాపణ చెప్పాలని సోమ భరత్ కుమార్ డిమాండ్ చేశారు. క్షమాపణను మొదటి పేజీలో తగిన ప్రాధాన్యంతో ప్రచురించడంతోపాటు డిజిటల్ వేదికలు, అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాల్లోనూ వెల్లడించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. గడువులోగా స్పందించకపోతే పరువు నష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం సంబంధిత సంస్థ, వ్యక్తులపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY





# యాదాద్రి భువనగిరి

## ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే



**వలిగొండ, అక్టోబర్ 18 (వార్తా వేదిక సూర్య):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని గోపరాజుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఊదరి దశరథ అనారోగ్యంతో మృతి చెందడంతో భువనగిరి ఎమ్మెల్యే కంభం అనిల్ కుమార్ రెడ్డి రూ. 10000 ఆర్థిక సహాయం ప్రకటించారు. ఆదివారం గోపరాజు పల్లి గ్రామ సర్పంచ్ సలిగంజి పృద్వి మృతిని కుటుంబానికి ఎమ్మెల్యే పంపించిన నగదు రూ .10000/- అందజేశారు. కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు సలిగంజి బిక్షపతి, నాయకులు పాలకూర్ల మల్లేశం, చిల్లర స్వామి, నల్లబోలు ధర్మేందర్, పూలగూర్ల నర్సిరెడ్డి, కోమటిరెడ్డి మల్లారెడ్డి, సలిగంజి బిక్షపతి, రుద్రపల్లి యాదయ్య, సంగపాక స్వామి, ఊదరి శోభన్ బాబు పాల్గొన్నారు.

## పాడి రైతుల సంక్షేమమే మదర్ డైరీ ధ్యేయం

**దసరా కానుకగా కొలనుపాక బైరాం నగర్ పాడి రైతులకు బోనస్ పంపిణీ**




**ఆలేరు, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):**

పాడి రైతుల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధే మదర్ డైరీ ప్రధాన ధ్యేయమని ఆ సంస్థ డైరెక్టర్ దొంతిరి సోమిరెడ్డి అన్నారు. ఆదివారం ఆలేరు మండలంలోని కొలనుపాక బైరాం నగర్‌లో పాడి రైతులకు దసరా కానుకగా బోనస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. పాల ఉత్పత్తిదారులు పాడి పరిశ్రమను మరింత అభివృద్ధి చేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. పశుపోషణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పాల ఉత్పత్తిని పెంచుకోవాలని, తద్వారా కుటుంబ ఆదాయాన్ని మెరుగుపరుచుకోవాలని అన్నారు. పాడి రైతుల అభ్యున్నతికి మదర్ డైరీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల సంఘం డైరెక్టర్లు బొజ్జ కళమ్మ, గొట్టం దయాకర్ రెడ్డి, గంధమల్ల మహేందర్, బెదరబోయిన వెంకటేష్, గంధమల్ల కిరణ్, దొంతిరి శంకర్ రెడ్డి, కోరిపల్లి మంజుల, బెదరబోయిన పెద్దపురం, బాల కుల్ల రాజయ్య, వేతన కార్యదర్శి సామల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో దుర్గామాత కుంకుమార్చన

**పసుపునూరి నాగభూషణం, వాణి దంపతులకు ఘన సన్మానం**

**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):**



భువనగిరి పట్టణంలోని తాగూర్ రోడ్డులో ఉన్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దుర్గామాత ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన భువనగిరి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, భువనగిరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పసుపునూరి నాగభూషణం, ఆయన సతీమణి వాణి దంపతులను దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు గజ్జల సంతోష్, బచ్చు శ్రవణ్, బుదుమ సంతోష్, పల్లెర్ల నవీన్, ఆవారు రాజుతో పాటు పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సద్దుల బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు

**తుర్కపల్లి, అక్టోబర్ 18 ( వార్త వేదిక సూర్య ):**



యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామంలోని పెద్దమ్మగడ్డ వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా లైటింగ్, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలేరు ఆత్మ కమిటీ డైరెక్టర్ జింకల ఎల్లేష్ యాదవ్ పెద్దమ్మగడ్డను సందర్శించి, వేడుకల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. పండుగను ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించేందుకు అవసరమైన సౌకర్యాలపై దృష్టి సారించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకుంటారు. పెద్దమ్మగడ్డ వద్ద సద్దుల బతుకమ్మ వేడుకలను సంప్రదాయబద్ధంగా, వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.గ్రామ ప్రజలు, మహిళలు పాలుగోన్నారు.

# ధర్మానికి ప్రతీక విజయదశమి

- చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి
- మహిషాసురుడిని సంహరించిన దుర్గాదేవి.. రావణాసురుడిని ఓడించిన శ్రీరాముడు
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ సంబరాలు, జమ్మి పూజ
- పనిముట్ల పూజతో శ్రమకు గౌరవం.. కొత్త పనుల ప్రారంభానికి విజయదశమి శుభదినం
- అహంకారం, అసూయ, ద్వేషాన్ని విడిచిపెట్టి ఐకమత్యంతో జీవించాలనే సందేశం

**ఆలేరు, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):**



భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో దసరా పండుగకు విశిష్ట స్థానం ఉంది. విజయదశమిగా ప్రసిద్ధి చెందిన ఈ పర్వదినం చెడుపై మంచి, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుం ది. దుర్గాదేవి మహిషాసురుడిని సంహరించడం, శ్రీరాముడు రావణాసురుడిపై విజయం సాధించ దం వంటి పురాణ గాథలు ఈ పండుగకు ఆధ్యాత్మిక ప్రాధాన్యాన్ని చేకూర్చాయి. దేశవ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకునే దసరా పండుగ తెలంగాణలో బతుకమ్మ సంబరాలు, అమ్మవారి పూజలు, జమ్మి చెట్టు పూజతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది.

### దుష్టశక్తులపై దుర్గాదేవి సమరం.. మహిషాసురుడి సంహారం!

హిందూ పురాణాల ప్రకారం మహిషాసురుడు అనే రాక్షసుడు తన శక్తితో దేవతలను ఇబ్బందులకు గురిచేస్తూ లోకాలను భయభ్రాంతులకు గురిచేశాడు. అతడి దౌర్జన్యాలను అరికట్టేందుకు దేవతల శక్తుల సమాహారంగా ఆదిపరాశక్తి దుర్గాదేవి అవతరించింది. మహిషాసురుడితో తొమ్మిది రోజుల పాటు యుద్ధం చేసి, పదో రోజున అతడిని సంహరించినట్లు పురాణ గాథలు వివరిస్తాయి. ఈ విజయానికి గుర్తుగా విజయదశమిని జరుపుకుంటారు. విజయం మహిళా శక్తికి, ధైర్యానికి, ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుంది. ఎంతటి బలమైన దుష్టశక్తులైనా ధర్మం ముందు ఓడిపోవాల్సిందేననే సందేశాన్ని ఈ గాథ అందిస్తుంది.

### రావణాసురుడి అహంకారానికి పతనం.. శ్రీరాముడి ధర్మవిజయం!

రామాయణం ప్రకారం లంకాధిపతి రావణాసురుడు సీతాదేవిని అపహరించడంతో శ్రీరాముడు లంకపై యుద్ధం చేశాడు. లక్ష్మణుడు, హనుమంతుడు, వానర సైన్యం సహాయంతో రావణాసురుడిని సంహరించి సీతాదేవిని తిరిగి పొందాడు. ఈ విజయాన్ని స్మరించుకుంటూ దేశంలోని పలు ప్రాంతాల్లో విజయదశమి వేడుకలు నిర్వహిస్తారు. ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో రావణుడు, కుంభకర్ణుడు, మేఘనాథుడి దిష్టిబొమ్మలను దహనం చేస్తారు. అహంకారం, దురాశ, అధర్మం చివరకు పతనమవుతాయనే భావనకు ఈ ఆచారం ప్రతీకగా నిలుస్తుంది.

### తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే దసరా సంబరాలు!

తెలంగాణలో దసరా పండుగకు ప్రత్యేకమైన సాంస్కృతిక ప్రాధాన్యం ఉంది. దసరాకు ముందు నిర్వహించే బతుకమ్మ సంబరాలు రాష్ట్ర సంస్కృతి, ప్రకృతిపై ప్రేమ, మహిళల ఐక్యతను ప్రతిబింబిస్తాయి. వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు పాడుతూ మహిళలు ఉత్సాహంగా వేడుకలు నిర్వహిస్తారు. విజయదశమి రోజున జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించడం, జమ్మి ఆకులను బంగారానికి ప్రతీకగా భావించి బంధుమిత్రులకు పంచుకోవడం తెలంగాణలో కొనసాగుతున్న ముఖ్యమైన సంప్రదాయం. పెద్దల ఆశీర్వాదాలు తీసుకోవడం, బంధువులను కలుసుకోవడం, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకోవడం పండుగలో నిలుస్తాయి.

### పనిముట్లకు పూజ.. శ్రమకు గౌరవం!

ఆయుధ పూజ, పనిముట్ల పూజ నిర్వహించడం మరో ముఖ్యమైన సంప్రదాయం. రైతులు వ్యవసాయ పనిముట్లను, కార్మి కులు తమ వృత్తి సాధనాలను పూజిస్తూ ఉపాధినిచ్చే పరికరాల పట్ల గౌరవాన్ని చాటుకుంటారు. కొత్త పనులు ప్రారంభించడానికి విజయదశమిని శుభదినంగా భావించే సంప్రదాయం కూడా అనేక ప్రాంతాల్లో ఉంది.

### మనలోని చెడును జయించడమే అసలైన విజయదశమి!

దసరా పండుగ కేవలం పూజలు, ఉత్సవాలకే పరిమితం కాదు. ప్రతి ఒక్కరూ తమలోని అహంకారం, అసూయ, ద్వేషం, స్వార్థం వంటి ప్రతికూల లక్షణాలను విడిచిపెట్టి సత్యం, ధర్మం, నిజాయితీతో జీవించాలని ఈ పండుగ సూచిస్తుంది. కులమత భేదాలకు అతీతంగా ప్రజలంతా ఐకమత్యంతో జీవిస్తూ, మహిళలను గౌరవిస్తూ, సమాజంలో శాంతి, సోదరభావం, సమానత్వాన్ని పెంపొందించాలని సందేశమిస్తుంది.

### ధర్మమే అంతిమ విజయం.. విజయదశమి సందేశం!

దుర్గాదేవి మహిషాసురుడిపై సాధించిన విజయం, శ్రీరాముడు రావణాసురుడిపై సాధించిన గెలుపు తరతరాలకు స్ఫూర్తినిచ్చే పురాణ గాథలు. చెడు ఎంత బలంగా కనిపించినా, సత్యం, ధర్మం కోసం నిలబడితే విజయం సాధ్యమనే విశ్వాసాన్ని ఈ పండుగ ప్రజల్లో నింపుతుంది. మనలోని చెడును జయించి, మంచిని ఆచరిస్తూ సమాజంలో ప్రేమ, శాంతి, ఐక్యతలను పెంపొందించుకోవడమే విజయదశమి పండుగ అందించే అసలైన సందేశం. ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరియాలని, ప్రతి మనసులో మానవత్వం పరిమళించాలని ఈ పర్వదినం ఆకాంక్షిస్తుంది.

# దోమల బెడదతో ప్రజల అవస్థలు

**మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లేదని స్థానికుల ఆవేదన**

**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):**



యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని 7వ వార్డులో మురుగు సమస్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. మురుగు నీరు ఖాళీ ప్లాట్లు, రోడ్లపైకి చేరడంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. ఈగలు, దోమల బెడద పెరగడంతో స్థానికులు సీజనల్ వ్యాధుల భయంతో ఆందోళన చెందుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

**పరిష్కారం కోసం ఎదురుచూపులు**

వార్డులో నెలకొన్న మురుగు సమస్యను మున్సిపల్ చైర్‌పర్సన్, స్థానిక కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లభించడం లేదని స్థానికులు వాపోతున్నారు. మురుగు నీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు పెరిగి ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు స్పందించేది ఎప్పుడు?**

పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ, మురుగు కాలువల శుభ్రతపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉన్నప్పటికీ, 7వ వార్డులో సమస్య కొనసాగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. పలుమార్లు సమస్యను తెలియజేసినా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి**

ప్రజలకు అవసరమైన పారిశుద్ధ్య పనులు, మురుగు కాలువల నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని వార్డు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిధులు ప్రజలకు ఉపయోగపడే మౌలిక సదుపాయాల కల్పనకు సద్వినియోగం కావాలని కోరుతున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్, స్థానిక కౌన్సిలర్, కమిషనర్ సమన్వయంతో పనిచేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**దోమలు, ఈగలతో జ్వరాలు వస్తున్నాయి: బుగ్గ స్వాతి**

ఇళ్ల మధ్య మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోందని, దోమలు, ఈగల సంఖ్య పెరిగిందని బుగ్గ స్వాతి ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరారు.

**సీజనల్ వ్యాధుల భయం వెంటాడుతోంది: భువనగిరి నాగలక్ష్మి**

మురుగు నీటి కారణంగా దోమలు, ఈగలు పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని భువనగిరి నాగలక్ష్మి తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, కౌన్సిలర్లకు సమస్యను తెలియజేసినా పరిస్థితిలో మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 7వ వార్డులో మురుగు సమస్యను పరిష్కరించి, ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని కోరారు.

## మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ ఫ్లెక్సీల ధ్వంసం

**నిందితులపై చట్టపరమైన చర్యలు తప్పవు**



**ఆత్మకూరు (ఎం), అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ శుభాకాంక్షల ఫ్లెక్సీలను చించేసిన గుర్తుతెలియని దుండగులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ హెచ్చరించారు.సమాచారం ప్రకారం, దసరా దీపావళి పండుగల సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఇటీవల మండల కేంద్రంలో మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే, అక్టోబర్ 16వ తేదీ అర్ధరాత్రి వేళ గుర్తుతెలియని వ్యక్తులు ఆ ఫ్లెక్సీలను చించివేసి ధ్వంసం చేశారు. ఈ ఘటనపై తక్షణమే స్పందించిన ఫౌండేషన్ ప్రతినిధులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు వేగవంతం చేశారు.

**సేవా కార్యక్రమాలను నిరుత్సాహపరచడం సరైనది కాదు: సర్పంచ్**

ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు ఆత్మకూరు మండల కేంద్రంలో ప్రెస్ మీట్ నిర్వహించారు.ఈ విలేకరుల సమావేశంలో పాల్గొన్న స్థానిక సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ మాట్లాడుతూ.. "మానవసేవే మాధవసేవ" అనే గొప్ప ఆశయంతో మబ్బు మహేష్ స్వచ్ఛందంగా మబ్బు అబ్బాస్ ఫౌండేషన్‌ను స్థాపించి, ఆలేరు నియోజకవర్గ వ్యాప్తంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు అందిస్తున్నారని కొనియాడారు. సమాజ హితం కోసం, పేదల సంక్షేమం కోసం ముందుకు వచ్చే వ్యక్తులను, సంస్థలను సమాజం ప్రోత్సహించాలే తప్ప, ఇలాంటి నిరుత్సాహపరిచే చర్యలకు పాల్పడటం ఎంతమాత్రం తగదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలను ధ్వంసం చేసిన సంస్కృతి లేని వ్యక్తులను గుర్తించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# శివాలయంలో వైభవంగా దుర్గాష్టమి వేడుకలు!

**దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు**

**ప్రత్యేక పూజలు, చండీహవనంలో పాల్గొన్న భక్తులు**

**యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయమైన శివాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. దుర్గాష్టమి సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రాతఃకాల పూజలు, పారాయణాలు, శ్రీదేవి మూలమంత్ర జపాలు, చండీహవనం, లలితా సహస్రనామార్చన చేపట్టారు. అనంతరం శ్రీదేవికి చతుష్షష్టి ఉపచార పూజలు నిర్వహించి, నీరాజనాలు సమర్పించారు. మంత్రపుష్పాలతో పూజలు ముగిసిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. చండీహవనంలో భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నవావరణ పూజలు, కుంకుమార్చనలు, సువాసినీ పూజ, కుమారీ పూజలను నిర్వహించారు. అమ్మవారికి మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

**వైకుంఠ ద్వారం వద్ద ప్రత్యేక పూజలు**



యాదగిరిగుట్ట కొండ కింద వైకుంఠ ద్వారం సమీపంలోని ప్రత్యేక మండపంలోనూ దుర్గాష్టమి వేడుకలను పురస్కరించుకుని శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు, ఉమ్మడి జిల్లా ఉత్తమ యువజన అవార్డు గ్రహీత కైరంకొండ నవీన్ కుమార్, ఆకుల గిరిబాబుతో పాటు పలువురు యువకులు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# ఉద్యోగ భద్రత కల్పించాలి

**- కలెక్టరేట్ ఎదుట ఐదు రోజులుగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన దీక్షలు.. జిల్లాలో 380 మంది ఉద్యోగుల ఆందోళన.**

**- సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక**





యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):

ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు తమ హక్కుల సాధన కోసం ఆందోళన బాట పట్టారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ఐదు రోజులుగా నిరసన దీక్షలు కొనసాగిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 17 వేల మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 78 కేటగిరీలకు చెందిన 380 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇవ్వకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### ఉద్యోగ భద్రత లేని ప్రజా సేవలు!

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, తల్లి-బిడ్డల సంరక్షణ, వ్యాధుల నియంత్రణ, ఆరోగ్య కార్యక్రమాల అమలు, ప్రజల్లో ఆరోగ్య అవగాహన కల్పించడం వంటి బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ప్రజారోగ్య వ్యవస్థకు వెన్నుదన్నుగా నిలుస్తున్నప్పటికీ తమకు ఉద్యోగ భద్రత, తగిన వేతనాలు, భవిష్యత్తుపై భరోసా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి, అన్ని కేడర్లకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

### సమాన పనికి సమాన వేతనం ఏదీ?

ఒకే తరహా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల మధ్య వేతన వ్యత్యాసాలు తొలగించాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. అర్హతలు, విధుల స్వభావం, పని భారం ఆధారంగా న్యాయబద్ధమైన వేతనాలు కల్పించాలని కోరుతున్నారు. సమాన పనికి సమాన వేతనం అమలుతో పాటు మహిళా ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు, ఆర్థిక ప్రయోజనాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### క్రమబద్ధీకరణతోనే భవిష్యత్తుకు భరోసా

దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించి, చట్టపరమైన ఉద్యోగ భద్రత కల్పించాలని జేఏసీ నాయకులు కోరుతున్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాల్లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు సమగ్ర విధానం రూపొందించాలని సూచిస్తున్నారు. కొన్ని విభాగాలకే పరిమితం కాకుండా అన్ని కేడర్ల ఉద్యోగులకు సమాన న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

### నిరసనకు వివిధ వర్గాల మద్దతు

కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న ఉద్యోగుల నిరసనకు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నుంచి మద్దతు లభిస్తోంది. ఉద్యోగుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించి, ఆరోగ్య సేవలకు అంతరాయం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మద్దతుదారులు కోరుతున్నారు. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చి, సమస్యల పరిష్కారానికి కాలపరిమితితో కూడిన కార్యాచరణ ప్రకటించాలని ఉద్యోగులు ఆశిస్తున్నారు.

### చర్చలకు పిలవకుంటే ఉద్యమమే: ఎం.డీ. షాహీద్ అలీ

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఫిజియోథెరపిస్ట్, భువనగిరి జీజీహెచ్ ఉద్యోగి ఎం.డీ. షాహీద్ అలీ డిమాండ్ చేశారు. ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయడంతో పాటు చట్టపరమైన ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అన్ని కేడర్ల ఉద్యోగులకు సమాన న్యాయం జరిగేలా ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని అన్నారు.

### సమస్యల పరిష్కారంలో జాప్యం ఎందుకు?: బానోతు నెహ్రూ

ఉద్యోగులు తమ సమస్యలను సామరస్యంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ పరిష్కారంలో జాప్యం ఎందుకు జరుగుతోందో అర్థం కావడం లేదని డీపీవో, డీఎంహెచ్‌వో కార్యాలయ ఉద్యోగి బానోతు నెహ్రూ అన్నారు. ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఐక్యతతో తమ హక్కులను సాధించుకుంటామని స్పష్టం చేశారు.

## దసరా కానుకగా నూతన వస్త్రాలు

**సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంపిణీ**

భువనగిరి మండల అక్టోబర్ 18: (వార్త వేదిక సూర్య)



విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని భువనగిరి మండలం తాజ్‌పూర్ గ్రామ పంచాయతీ సిబ్బందికి గ్రామ సర్పంచ్ ర్యాకల సంతోష శ్రీనివాస్ నూతన వస్త్రాలను అందజేశారు. పండుగ వేళ పంచాయతీ సిబ్బందిని కుటుంబ సభ్యులుగా భావించి దసరా కానుకగా వస్త్రాలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు నిత్యం సేవలందిస్తూ, గ్రామ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న పంచాయతీ సిబ్బంది సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి పండుగ సందర్భంగా నూతన వస్త్రాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం తాజ్‌పూర్ గ్రామ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి సుఖశాంతులతో, సంతోషంగా పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నర్సింగ్‌రావు, ఉపసర్పంచ్ వరిగంటి కృష్ణ, వార్డు సభ్యులు పల్లెపాటి కృష్ణ, మహ్మద్ గాలిబీ యాకుబ్, బొమ్మారపు రామకృష్ణ, బొమ్మారపు లక్ష్మి బాలరాజు, బీట్కూరి మహేష్, వరిగంటి మానస నాగరాజు, షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ ఫలాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**30, 31వ వార్డుల కౌన్సిలర్లు ఎం.డి. లయిక్ అహ్మద్, సుమయ్య తబస్సుమ్ షఫీక్ అహ్మద్**

భువనగిరి టౌన్ అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):



భువనగిరి పట్టణంలోని 30, 31వ వార్డుల పరిధిలోని రేషన్ దుకాణం నంబరు 16లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల కౌన్సిలర్లు ఎం.డి. లయిక్ అహ్మద్, సుమయ్య తబస్సుమ్ షఫీక్ అహ్మద్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందేందుకు ఈ స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్డు రాష్ట్రంలో గుర్తింపు పత్రంగా ఉపయోగపడుతుందని, అందులోని త్వరిత స్పందన సంకేతం (క్యూఆర్ కోడ్) ద్వారా కార్డుదారునికి సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకోవచ్చని వివరించారు. గత ప్రభుత్వం కొన్ని సంవత్సరాలుగా కొత్త తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లక్షలాది మందికి తెల్ల రేషన్ కార్డులు అందించడంతో పాటు పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులో భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. మాజీ కౌన్సిలర్ ఎం.డి. షఫీ అహ్మద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎం.డి. మన్సూర్, ఎం.డి. జబ్బార్, సంతోష్ నాయక్, తాజీర్ పాషా, కబీర్, రేషన్ దుకాణం నిర్వాహకుడు శేఖర్, అఫ్సర్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

## బేతి నాగరాణికి జ్యూరీ పురస్కారం

మోత్కూరు, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య );



ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అత్యంత వైభవంగా హైదరాబాద్ లో నిర్వహించిన "బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ - 2026" పోటీల్లో వ్యాసాల (ఆర్టికల్స్) విభాగంలో మోత్కూరుకి చెందిన రచయిత్రి, తెలుగు వికీపీడియన్ బేతి నాగరాణి ప్రతిష్టాత్మక ప్రత్యేక జ్యూరీ బహుమతిని కైవసం చేసుకున్నారు. ఆమె వ్రాసిన "ప్రగతిపథంలో ప్రజాపాలన" అనే వ్యాసానికి ఈ గౌరవం దక్కింది.
అక్టోబర్ 18న హైదరాబాద్, మాదాపూర్ లోని శిల్పకళా వేదికలో తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ క్రియేటివ్ డైరెక్టర్ కొండా రాజు, ఎఫ్‌డీసీ ఈడి కిషోర్ బాబు, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డా.. మామిడి హరికృష్ణ,సినీ నటుడు రచ్చ రవి తదితరులు బేతి నాగరాణికి పురస్కారాన్ని అందజేసి, అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగిన ఈ పోటీకి వెయ్యికి పైగా వ్యాసాలు రాగా అందులో ప్రజాపాలనా దృక్పథాన్ని, సామాజిక-ఆర్థిక మార్పులను స్పష్టమైన విశ్లేషణ,ఆకట్టుకునే శైలిలో వివరించినందుకు గాను బేతి నాగరాణికి ఈ ప్రత్యేక జ్యూరీ పురస్కారం లభించింది. ప్రజాపాలనలోని వివిధ కోణాలను వ్యాసంలో అత్యద్భుతంగా ఆవిష్కరించినందుకు ఎఫ్‌డీసీ అధికారులు, పలువురు ప్రముఖులు నాగరాణిని ప్రత్యేకంగా ప్రశంసించారు.ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 1000 వ్యాసాలలో తాను వ్రాసిన ఎఫ్ డి సి అధికారులు గుర్తించి ప్రశంసించడం పట్ల సంతో షం వ్యక్తం చేశారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



అడ్డగూడూరు, అక్టోబర్ 18(వార్త వేదిక సూర్య)

యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం లోని అన్ని గ్రామాలలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని చిర్రగూడూరు గ్రామంలో ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలకు గ్రామ సర్పంచ్ లైట్లు ఏర్పాటు చేసి,సౌండ్ బాక్సుల ద్వారా బతుకమ్మ పాటలతో మహిళలు ఆడుతూ, పాడుతూ ఆనంద ఉత్సవాలను ఆస్వాదించగా సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ చిత్తలూరి సోమనారాయణ, ఉప సర్పంచ్ శీల లింగమల్లు ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ బతుకమ్మలలో మొదటి, రెండవ, మూడవ, స్థానంలో ఎన్నికైన బతుకమ్మలకు చీరలు పంపిణీ చేశారు. మొదటి బహుమతిగా, పర్రెపాటి దేవకమ్మ, కూటికంటి సుజాత. రెండవ బహుమతిగా, కొడారి లింగమ్మ, కమ్మంపాటి పూలమ్మ. మూడవ బహుమతిగా అరిగే శోభ, కొండ ఐలమ్మ గెలుచుకున్నారు.గెలుచుకున్న వారికి సర్పంచ్ చిత్తలూరి సోమనారాయణ, మాజీ పిఏసిఎస్ చైర్మన్ చిత్తలూరి హనుమంత రావు చీరల పంపిణీ చేశారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు



భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 18 (వార్తా వేదిక సూర్య)

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిక గా నిలచే బతుకమ్మ పండుగ వేడుకలు భూదాన్ పోచంపల్లి మండలం, పట్టణంలో సద్దుల బతుకమ్మ పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపిటిసిల ఫోరం మండల మాజీ అధ్యక్షురాలు బత్తుల మాధవి గౌడ్ ఆధ్వర్యంలో బతుకమ్మను ఆనందోత్సవాల తో మహిళలు జరుపుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రకృతిపై ఉన్న ప్రేమకు ప్రతికగా ని లచే బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు వివిధ రకాలైన రంగుల పూలతో సాంప్రదాయకంగా బతుకమ్మలను అందంగా పేర్చి బతుకమ్మ పాటలు పాడారు. సాంప్రదాయ పాటలతో మహిళల సందడి గ్రామంలో పండుగ శోభను సంతరించింది.

## సిమెంట్ బెంచీలు వితరణ

మోత్కూరు, అక్టోబర్ 18 ( వార్త వేదిక సూర్య): మండలంలోని సదర్శాపురం గ్రామంలో గ్రామ పంచాయతీ వద్ద సయ్యద్ లతీఫ్ ఫౌండేషన్ సౌజన్యంతో ఆయన కుమారుడు ప్రభుత్వ ఉపాధ్యాయులు సయ్యద్ తండ్రి జ్ఞాపకార్థంతో ఆదివారం సిమెంట్ బెంచీలను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుడిగా వృత్తి ధర్మాన్ని కొనసాగిస్తూ సమాజంలోని పేద విద్యార్థుల కొరకు అనేక సహకారం అందిస్తూ తమ ప్రజల పట్ల మమకారంతో గ్రామపంచాయతీ ఆవరణ వృద్ధుల కొరకు సిమెంట్ బెంచ్ లు ఏర్పాటుచేసిన సయ్యద్ ను ఆ గ్రామ సర్పంచ్ మునుకుంట్ల నీలకంఠం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ ఉపసర్పంచ్ తీగల వినోద్, వార్డు సభ్యులు ,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# యాదాద్రి భువనగిరి

## అంబరాన్నంటిన సద్దుల బతుకమ్మ సంబరాల



తుర్కపల్లి 18( వార్త వేదిక సూర్య ):

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు యాదాద్రి భువనగిరి జిల్లాతుర్కపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మన్నెపు రజిత తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గ్రామ మహిళలు, గ్రామ పెద్దలు, యువకులు ఉత్సాహంగా పాల్గొని పండుగ సంబరాలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతిపై ఉన్న ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిపారు. సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను సిద్ధం చేసి, వాటి చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొన్నారు. పూల సౌందర్యం, సంప్రదాయ పాటలు, మహిళల సందడి గ్రామంలో పండుగ శోభను మరింత పెంచాయి. సద్దుల బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతిలో విశిష్టమైన స్థానాన్ని కలిగి ఉందని, తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుకుంటూ భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, కుటుంబాల మధ్య అనుబంధాలకు, గ్రామ ప్రజల మధ్య సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. గ్రామ సర్పంచ్ మన్నెపు రజిత తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులంతా కలిసి వేడుకల్లో పాల్గొనడం గ్రామ ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. ఇలాంటి పండుగలు గ్రామీణ సంస్కృతిని పరిరక్షించడంతో పాటు యువతలో మన సంప్రదాయాల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సామల శ్రీనివాస్, పాశం గోవర్ధన్, నగరం కరుణాకర్, మహేందర్, నీలం కొమరయ్య, గుంటిపల్లి శివాజీ, కరోబారు కనకరాజు పాల్గొన్నారు. గ్రామస్థుల భాగస్వామ్యంతో బతుకమ్మ వేడుకలు పండుగ వాతావరణంలో ఘనంగా జరిగాయి.

## ఆయుధ, వాహన పూజలు

**ఆయుధాలు, వాహనాలను జాగ్రత్తగా వినియోగిస్తూ ఆరోగ్యంగా, ఆనందంగా విధులు నిర్వహించాలి: జిల్లా ఎస్పీ అక్షాన్స్ యాదవ్**



భువనగిరి టౌన్, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య)

దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భువనగిరిలోని డీఏఆర్హె డ్క్వార్టర్స్‌లో ఆయుధ, వాహన పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అక్షాన్స్ యాదవ్ ఐపీఎస్ పాల్గొని పోలీస్ ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ విధుల్లో ఆయుధాలు, వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. వాటిని ఎల్లప్పుడూ అప్రమత్తతతో, బాధ్యతాయుతంగా, జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. విధి నిర్వహణలో ఎలాంటి ప్రమాదాలు, ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు పాటిస్తూ, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ ఆనందకరమైన వాతావరణంలో విధులు నిర్వహించాలని ఎస్పీ ఆకాంక్షించారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, శాంతి, శ్రేయస్సు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు లక్ష్మీనారాయణ, వినోద్, డీఎస్పీలు శ్రీనివాస్ నాయుడు, సురేష్, సీఐ చంద్రబాబు, ఆర్ఐలు శ్రీనివాస్ నాయుడు, లతీఫ్ ఉద్దీన్‌తో పాటు ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

తుర్కపల్లి, అక్టోబర్ 18(వార్త వేదిక సూర్య ):



యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో సద్దుల బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకల్లో గ్రామ మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, మహిళలు కలిసికట్టుగా వేడుకల్లో పాల్గొని సద్దుల బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు



# యాదాద్రి భువనగిరి

## కొత్త పెన్షన్లు మంజూరు చేయాలి




మోత్కూరు, అక్టోబర్ 18 ( వార్త వేదిక సూర్య);

గత నాలుగేళ్లుగా ఆసరా పెన్షన్లు మంజూరు లేకపోవడం వల్ల అర్హులైన ఎంతో మంది లబ్ధిదారులు ఎదురు చుస్తున్నారని ఆయా వర్గాల ప్రజలకు రాష్ట ప్రభుత్వం వెంటనే కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు రాష్ట ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ అర్హులదరికి దసరా నుండి ఆసరా కొత్త పెన్షన్లు ఇస్తామంటూ ప్రభుత్వం ఆగస్టు 15 నుండి సెప్టెంబర్ 15 వరకు నెలరోజుల పాటు అర్హులైన లబ్ధిదారుల నుండి ధరఖాస్తులు స్వీకరించి దసరా నుండి లబ్దిదారులకు అందిస్తామని ప్రభుత్వం ప్రకటన చేసిందని,కానీ ఆ పెన్షన్ల పై నేడు జాడ పత్తాలేదన్నారు. వృద్యాప్య పెన్షన్లలకు ధరఖాస్తులో అప్షన్ లేకపోవడంతో అర్హులైన వృద్ధులు అనేకమంది ఆందోళన చెందుతున్నారన్నారు, ఈ నాలుగేళ్లలో 57 సంవత్సరాలు నిండిన వారికి అవకాశం లేకపోవడంతో నిరాశకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ధరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారునికి వెంటనే మంజూరు చేయాలని,,వృద్ధులకు కూడా పెన్షన్లు పొందెందుకు అవకాశం కల్పించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆయన వెంట ఆ పార్టీ మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్,పానుగుల రమేష్ ఉన్నారు.

## ఆకాల వర్షం.. ఆపార నష్టం



మోత్కూరు, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):

చేతికొస్తుందనుకున్న వరి పంట భారీ వర్షానికి నేలవాలడంతో అన్నదాతకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలోని అనాజీపురం గ్రామంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి గ్రామ రైతు చేకూరి వెంకన్న సాగు చేసిన ఎనిమిదిన్నర ఎకరాల వరి పంట మొత్తం నేలవాలింది. దీంతో సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు. ఒక ప్రక్క రాష్ట్రంలో ఎల్ ని ఓ. ప్రభావం ఉన్నప్పటికీ శనివారం రాత్రి అకాల ఈదురుగాలులతో భారీ వర్షం పడటంతో ఆరుగాలం శ్రమించి,పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట కళ్లముందే నేలవాలడంతో రైతు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పంట దిగుబడిపై పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే సాగు ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న తరుణంలో వర్షం రూపంలో ఎదురైన నష్టం తమను మరింత కుంగదీసిందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి, నష్టాన్ని అంచనా వేయాలని రైతు వెంకన్న కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పంటకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రమాదవశాత్తు చెరువులో జారిపడి వ్యక్తి మృతి



మోత్కూరు, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):

మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో సద్దుల బతుకమ్మ పండుగ రోజున తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. స్థానిక పెద్ద చెరువు వద్దకు కాలకృత్యాల కోసం వెళ్లిన ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి ప్రాణాలు కోల్పోయాడు. ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి మోత్కూరు గాంధీనగర్‌కు చెందిన కూరేళ్ల బిక్షం (55) గా గుర్తించారు. ఆయన స్థానిక మహాత్మా జ్యోతి రావు పూలే చౌరస్తాలో చేపల వ్యాపారం చేస్తూ, కులవృత్తి ప్రకారం డప్పు కొడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున కాలకృత్యాల నిమిత్తం సమీపంలోని పెద్ద చెరువు వద్దకు వెళ్లగా, కాలుజారి నీటిలో పడిపోవడంతో మృతి చెందారు. మృతుడు బిక్షం కుటుంబానికి ఆయనే ఏకైక ఆధారంగా ఉన్నారు. ఆయనకు భార్య యాదమ్మ, ఇద్దరు కుమారులు ఉండగా.. ఒక కుమారుడు గతంలో మృతి చెందగా, మరొక కుమారుడు పక్షవాతంతో బాధపడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబంలో ఇంటి పెద్దదిక్కు కోల్పోవడంతో పండుగ పూట గాంధీనగర్ కాలనీలో తీవ్ర శోకసంద్రం అలుముకుంది. కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. సమాచారం అందుకున్న మోత్కూరు ఎస్ఐ సతీష్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుని భార్య యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# స్వామివారి దర్శనానికి మూడు గంటల నిరీక్షణ!

**వారాంతపు సెలవుతో పోటెత్తిన భక్తులు.. 25 వేల మందికి దర్శనం.. దేవస్థానానికి రూ.23.14 లక్షల ఆదాయం**

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):



యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. వారాంతపు సెలవు కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. భక్తుల హరిహర నామస్మరణతో పుణ్యక్షేత్రం మార్మోగింది. కొండ కింద లక్ష్మీపుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు కొండపైకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయ తిరువీధులు, దర్శన క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి.

### మూడు గంటల నిరీక్షణ

స్వామివారి దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. ధర్మదర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టగా, ప్రత్యేక దర్శనానికి వచ్చిన భక్తులు సైతం నిరీక్షించారు. ఆదివారం సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు దేవస్థాన అధికారులు వెల్లడించారు.

### శాస్త్రోక్తంగా నిత్యారాధనలు

ఆలయంలో వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారి నిత్యారాధనలు ప్రారంభమయ్యాయి. గర్భాలయంలోని స్వయంభువులకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్య తిరుకల్యాణోత్సవం సంప్రదాయబద్ధంగా కొనసాగాయి. రాత్రి మహానివేదన, శయనోత్సవం నిర్వహించిన అనంతరం ఆలయ ద్వారబంధనం చేశారు.

### శివాలయంలో ప్రత్యేక పూజలు

యాదగిరిగుట్ట శివాలయంలో శ్రీరామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు, నిత్య రుద్రహవనం నిర్వహించారు. కొండ కింద వ్రత మండపంలో సత్యనారాయణస్వామి వ్రత పూజలు కొనసాగాయి. వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

### దేవస్థానానికి రూ.23.14 లక్షల ఆదాయం

భక్తుల రాకతో యాదాద్రి దేవస్థానానికి ఆదాయం సమకూరింది. వివిధ విభాగాల ద్వారా రూ. 23,14,282 ఆదాయం వచ్చినట్లు దేవస్థాన ఈవో భవానీశంకర్ తెలిపారు.

# ఘనంగా 'సద్దుల బతుకమ్మ' వేడుకలు

ఆత్మకూరు (ఎం), అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల పరిధిలోని పల్లెర్ల గ్రామంలో తెలంగాణ విశిష్ట సంస్కృతికి ప్రతీక అయిన 'సద్దుల బతుకమ్మ' వేడుకలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో గ్రామ సర్పంచ్ తండ మంజుల నరసింహ గౌడ్ పాల్గొని గ్రామీణ మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాలుపంచుకున్నారు.గ్రామంలోని మహిళలు, యువతులు రకరకాల తీరొక్క పూలతో శోభాయమానంగా బతుకమ్మలను పేర్చి, స్థానిక బతుకమ్మ ఘాట్ వద్దకు చేరుకున్నారు. అందరూ ఒకచోట చేరి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ జానపద పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ ఉత్సాహంగా ఆడారు. ఈ సందర్భంగా సర్పంచ్ తండ మంజుల నరసింహ గౌడ్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి, ఆడపడుచుల ఆత్మగౌరవానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రకృతిని దైవంగా పూజించే ఏకైక పండుగ బతుకమ్మ అని, గ్రామంలో ప్రజలందరూ ఐక్యమత్యంతో, సంతోషంగా ఈ వేడుకలను జరుపుకోవడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. గ్రామ ప్రజలందరికీ ఆయన సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బతుకమ్మలను చెరువులో నిమజ్జనం చేసి, మహిళలు ఒకరికొకరు వాయనాలు మార్చుకుని సద్దులను పంచుకున్నారు. గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డంపింగ్ యార్డుపై అధికారుల నిర్లక్ష్యమా?

**ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పరిష్కారం ఏదీ? చిన్నారుల ఆరోగ్యంపై ఆందోళన**

నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 18 (వార్తా వేదిక సూర్య )



చందనపల్లి చెత్త డంపింగ్ యార్డు సమస్యపై మున్సిపల్ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డును శాశ్వతంగా తరలించాలని కోరుతూ అక్టోబర్ 12న ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతోపాటు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినా సమస్య పరిష్కారానికి చర్యలు కనిపించడం లేదని ఫిర్యాదుదారుడు పేర్కొంటున్నారు. డంపింగ్ యార్డు పరిసరాల్లో చెత్త నిల్వ, దుర్వాసన, వ్యర్థాలను కాల్చడం వల్ల పొగ వంటి సమస్యలు ఉన్నాయని వినతిపత్రంలో ప్రస్తావించారు. పరిసర గ్రామాల ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.ప్రజావాణి రసీదు ప్రకారం ఫిర్యాదును నల్లగొండ మున్సిపాలిటీకి పంపించారు. అయినప్పటికీ సమస్య పరిష్కారంపై స్పష్టత లేదని ఫిర్యాదుదారుడు చెబుతున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

## బతుకమ్మ సంబరాల వేడుకలు

మోత్కూరు,అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):



మోత్కూరు మున్సిపాలిటీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం రాత్రి సద్దుల బతుకమ్మ సంబరాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో భాగంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సాంప్రదాయ దుస్తులు ధరించి పాటలు పాడుతూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రంలోని ఉన్నత పాఠశాల ప్రాంగణంతో పాటు మార్కెట్ యార్డులోనూ మహిళలు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు.. పూల పరిమళాలు, బతుకమ్మ పాటలు, ఆటపాటలతో పట్టణం,పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది.

## సద్దుల బతుకమ్మ సంబరాలు

తుర్కపల్లి, అక్టోబర్ 18 ( వార్త వేదిక సూర్య ):



యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలోని బీసీ కాలనీ గ్రంథాలయం వద్ద మహిళలు సద్దుల బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆటపాటలతో సంబరాలు జరుపుకున్నారు.

## బతుకమ్మ వేళా చీకట్లోనే సంబరాలు

**ఆలేరు పోచమ్మవాడ శాంతినగర్ కాలనీలో వెలగని మున్సిపల్ లైట్లు.. మహిళలకు తప్పని ఇబ్బందులు**

ఆలేరు, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేళ ఆలేరు మున్సిపాలిటీలో కనీస సౌకర్యాల కల్పనపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని పోచమ్మవాడ శాంతినగర్ కాలనీలో పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన మున్సిపల్ లైట్లు వెలగకపోవడంతో మహిళలు చీకట్లోనే బతుకమ్మ ఆడాల్సిన పరిస్థితి నెలకొందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు మహిళలు బతుకమ్మ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకుంటుంటే, మరోవైపు వీధి దీపాలు వెలగకపోవడంతో ఇబ్బం దులు ఎదురవుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. పండుగ ఏర్పాట్లలో భాగంగా ఏర్పాటు చేసిన లైట్లు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో అధికారులు ముందుగానే పరిశీలించాల్సి ఉన్నప్పటికీ, పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శిస్తున్నారు. పండుగల సమయంలోనైనా వీధి దీపాలు, ఇతర కనీస సౌకర్యాలు కల్పించడంపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## కొండమడుగులో దుర్గామాత అన్న ప్రసాద కార్యక్రమం

బీబీనగర్ మండల్ అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య)



యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల్ కొండమడుగు గ్రామంలో ప్రతిష్టించిన దుర్గామాత ఉత్సవ మండపంలో ఎనిమిదవ రోజు శ్రీ దుర్గాదేవి అలంకరణ అమ్మవారి పూజ కార్యక్రమంలో పాల్గొన్న బీబీనగర్ మండల్ మాజీ జెడ్పిటిసి మాజీ ఎంపీపీ గోలి ప్రణీతా పింగళి రెడ్డి దంపతులు పాల్గొని పూజలు నిర్వహించడం జరిగినది అన్నప్రసాద దాతలు గోలి ప్రణీత పింగళి రెడ్డి తర్వాత ఏర్పాటుచేసిన అన్న ప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించినారు ఈ కార్యక్రమంలో కొండమడుగు గ్రామ సర్పంచ్ కడెం పాండురంగం బీబీనగర్ మండల సింగిల్ విండో చైర్మన్ శ్యామ్ గౌడ్ వైస్ చైర్మన్ వాకిటి చంద్రశేఖర్ రెడ్డి ఉప సర్పంచ్ అరిగే శ్రీధర్ మాజీ జెడ్పిటిసి బీబీనగర్ మండల్ భాష బోయిన పెంటయ్య మాజీ ఎంపీటీసీ కడం చంద్రశేఖర్ మాజీ ఎంపిటిసి బాల్రాజ్ శేషు మాజీ వాడు మెంబర్ దేశం శ్రీకాంత్ గౌడ్ హనుమంతరావు దేవస్థానం కమిటీ చైర్మన్ గాండ్ల బాలరాజ్ దేవస్థాన సభ్యులు నరేష్ శివగల పంజాల అశోక్ గౌడ్ గాండ్ల రవి చెరుకు భాస్కర్ ఎరుకలి వెంకటేష్ గౌడ్ గంజి రాము కడెం శ్రీకాంత్ సంకూరి ఎరుకల వేణు అనిల్ బత్తుల శ్రీనివాస్ గౌడ్ చంద్ర గాని నరేష్ గౌడ్ ప్రకాష్ ఎరుకల రవి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



భువనగిరి టౌన్ స్వర్ణగిరి అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):

భూలోక వైకుంఠంగా విరాజిల్లుతున్న శ్రీ స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మిక శోభతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భారతీయ సనాతన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పాయి. ముఖ్యంగా శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్య మంగళ స్వరూపాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన విశేష అలంకరణ భక్తులకు కనువిందు చేసింది. స్వామివారి దివ్య రూపాన్ని తలపించేలా చేసిన ఈ అలంకరణ భక్తుల్లో భక్తిభావాన్ని, ఆధ్యాత్మిక ఆనందాన్ని నింపుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తి, కళ, సంప్రదాయాల సమ్మేళనంగా సాగిన స్వర్ణగిరి క్షేత్ర ప్రాంగణం ఆధ్యాత్మిక వైభవంతో అలరారింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాం స్కృతిక ప్రదర్శనలను ఆస్వాదించా రు. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తుల్లో దైవభక్తిని పెంపొందించడంతో పాటు భారతీయ సనాతన ధర్మం, ఆధ్యాత్మిక సంప్రదాయాల విశిష్టతను చాటిచెబుతున్నాయి. స్వర్ణగిరి క్షేత్రం లో కొనసాగుతున్న ఉత్సవాలు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తున్నాయి.

## వాహనాల వినియోగంలో అప్రమత్తత అవసరం

**ఎస్పీ అక్షాంశ్ యాదవ్**

**దసరా సందర్భంగా డీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఆయుధ, వాహన పూజలు**

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):



దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని యాదాద్రి భువనగిరి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భువనగిరిలోని జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ (డీఏఆర్) హెడ్‌క్వార్టర్స్‌లో ఆదివారం ఆయుధ, వాహన పూజలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ పోలీస్ ఆయుధాలు, వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ విధుల నిర్వహణలో ఆయుధాలు, వాహనాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ వాటిని బాధ్యతాయుతంగా, జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రమాదాలు, ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని, క్రమశిక్షణతో బాధ్యతలను నిర్వర్తించాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ ఉత్సాహంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సుఖసంతోషాలు, శ్రేయస్సును తీసుకురావాలని ఆకాంక్షించారు.

# “దేశాన్ని కాపాడాలంటే మీలాంటి యువత ముందుకు రావాలి”

## రాహుల్ గాంధీ ప్రశంసించారని తెలిపిన ఎన్ఎస్‌యూఐ నేత ఆడవత్ సర్దార్ నాయక్

నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 18 (వార్తా వేదిక సూర్య )



ఓటు హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కోసం తాను చేస్తున్న పోరాటాన్ని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అభినందించారని ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఆడవత్ సర్ధార్ నాయక్ తెలిపారు. న్యూఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో రాహుల్ గాంధీని కలిసిన సందర్భంగా ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం చేస్తున్న ఉద్యమాన్ని వివరించి నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా రాహుల్ గాంధీ తనను ప్రోత్సహిస్తూ ప్రశంసించారని సర్ధార్ నాయక్ తెలిపారు. ఈ ప్రోత్సాహం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మరింత పట్టుదలతో పనిచేయడానికి స్ఫూర్తినిచ్చిందన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారంతో పాటు ప్రజల ఓటు హక్కుల పరిరక్షణ కోసం తన పోరాటాన్ని కొన సాగిస్తానని స్పష్టం చేశారు. జైత్రం తండా నుంచి ఢిల్లీ వరకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలోని దామరచర్ల మండలం జైత్రం తండాకు చెందిన ఆడవత్ సర్ధార్ నాయక్ విద్యార్థుల సమస్యలతో పాటు జాతీయ స్థాయి ప్రజాస్వామ్య అంశాలపై గళమెత్తుతున్నట్లు తెలిపారు. యువత ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సీఈసీ రాజీనామా చేయాలనేది మాడిమాండ్ఓ టు హక్కుల పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతపై సమాధానాలు కోరుతూ తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని సర్ధార్ నాయక్ తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీ నామా చేయాలనే తమ డిమాండ్ నెరవేరే వరకు పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. ఓటు హ క్కు కీలక మన యువత చైతన్యంతో ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.





# చౌటుప్పల్ లో ఘనంగా సద్దుల బతుకమ్మ దృశ్యాలు



## ఘనంగా బతుకమ్మ సంబరాలు

నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 18 (వార్తా వేదిక సూర్య )

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను రాచకొండ దసరా ఉత్సవ సమితి, ఈఎల్‌వీ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ సందడి చేశారు. భారీ బతుకమ్మ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళల కోలాహలం, పూల బతుకమ్మలతో వేడుకల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పండుగను అందరూ కలిసికట్టుగా జరుపుకోవడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు.





# నల్లగొండ

## కంచర్ల దంపతుల ప్రత్యేక పూజలు



నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 18 (వార్తా వేదిక సూర్య)

నగరంలోని 32 వ డివిజన్ రాక్‌హిల్స్ కాలనీలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచామృతాలు, పసుపు, కుంకుమ, చందనంతో అమ్మవారికి అభిషేకం నిర్వహించి, పుష్పాలతో అలంకరించి ధూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం అర్చకులు కంచర్ల దంపతులకు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి వేదాశీర్వచనం చేశారు. కంచర్ల దంపతులు దాతలుగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, సింగం రామ్మోహన్, నగర పార్టీ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్, పెరిక యాదయ్య, పేర్ల మల్లీశ్వరి అశోక్, రత్నగిరి తారకమ్మ శ్రీనివాస్, కుందూరు దీపికా ప్రవీణ్‌రెడ్డి, బాణావత్ దీప్లా, దొడ్డి రమేష్, గోపగోని స్వాతి రాజశేఖర్, మాజీ కౌన్సిలర్లు గున్‌రెడ్డి యుగంధర్‌రెడ్డి, రావుల శ్రీనివాసరెడ్డి, మిర్యాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

## విద్యుత్ సిబ్బంది సేవలు అభినందనీయం

### కట్కూరి శ్రీనివాస్ రెడ్డి

నల్లగొండ బ్యూరో, అక్టోబర్ 18 (వార్తా వేదిక సూర్య )



ఏడీఈ ట్రాన్స్‌ఫార్మర్ల కార్యాలయంలో దుర్గాపూజ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావంతో పెరిగిన విద్యుత్ భారాన్ని సమర్థంగా ఎదుర్కొంటూ, వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తున్న విద్యుత్ సిబ్బందిని కట్కూరి శ్రీనివాస్ రెడ్డి అభినందించారు.విద్యుత్ వ్యవస్థ సజావుగా పనిచేసేందుకు సహకరిస్తున్న తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) చైర్మన్, నిర్వహణ సంచాలకుడు జితేష్ వి. పాటిల్, సంచాలకుడు నరసింహులు, ముఖ్య ఇంజినీర్లు బాలస్వామి, రవికుమార్, పర్యవేక్షక ఇంజినీర్ శ్రీనివాసులు, పంపిణీ విభాగం ఇంజినీర్ ప్రభాకర్ తదితర అధికారులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్ర స్థాయిలో విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్న సహాయ ఇంజినీర్లు శ్రీధర్ రెడ్డి, రాజు, స్వాతితో పాటు ఇతర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.విద్యుత్ వినియోగదారులు కూడా విద్యుత్‌ను పొదుపుగా వినియోగిస్తూ, విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, శాంతి, సిరిసంపదలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**భక్తిశ్రద్ధలతో గౌరీ పూజలు.**

**కళాకారుల నృత్యాలతో ఆటపాటలతో బతుకమ్మ సంబరాలు**

గట్టుప్పల, అక్టోబర్ 18 వార్త వేదిక సూర్య:



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సద్దుల బతుకమ్మ పర్వదినాన్ని పురస్కరించుకొని గట్టుప్పల మండల వ్యాప్తంగా మహిళలు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, భక్తిశ్రద్ధలతో గౌరీదేవికి పూజలు నిర్వహించారు. మండల కేంద్రం లోని శివాలయం దేవస్థానం శివ భక్త మార్కండేయ స్వామి దేవాలయం లో ఘనంగా బతుకమ్మ పండుగ సంబరాలు నిర్వహించారు.దుర్గామాతకు ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించిన అనంతరం బతుకమ్మల చుట్టూ సంప్రదాయబద్ధంగా ఆడిపాడుతూ సంబరాలు చేసుకున్నారు. మండలంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పాటలతో సందడి చేశారు. పూలతో అలంకరించిన బతుకమ్మలు రంగురంగుల హరివిల్లును తలపించాయి. పండుగ వాతావరణం ప్రతి గ్రామంలోనూ నెలకొంది. పూజల అనంతరం మహిళలు బతుకమ్మలను నిమజ్జనం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు, యువతులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడంతో సద్దుల బతుకమ్మ వేడుకలు మండల వ్యాప్తంగా వైభవంగా ముగిశాయి.

# బతుకమ్మ ఆటలా .. డీజే ఈవెంట్‌లా ?

**పెద్దపల్లి, అక్టోబర్ -18:**
**( వార్త వేదిక సూర్య )**

సంప్రదాయ వేడుకల్లో పెరుగుతున్న డీజే సంస్కృతి.. కనుమరుగవుతున్న పాతకాలపు బతుకమ్మ పాటలు!

తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో మారుతున్న వేడుకల తీరు.. సంప్రదాయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది!

ప్రత్యేక కథనం...తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ పండుగకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ప్రకృతిని ఆరాధిస్తూ, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, మహిళలంతా ఒకచోట చేరి సంప్రదాయ పాటలు పాడుతూ బతుకమ్మ చుట్టూ ఆడటం ఈ పండుగ ప్రత్యేకత. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయం తెలంగాణ ఆడపడుచుల జీవన విధానంలో భాగమైంది. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా బతుకమ్మ వేడుకల నిర్వహణలోనూ అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా కొన్ని ప్రాంతాల్లో డీజే సౌండ్‌లు, సినిమా పాటలు, భారీ సౌండ్ సిస్టమ్‌లు వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా మారుతున్న నేపథ్యంలో అసలు బతుకమ్మ పండుగ సంప్రదాయబద్ధంగా జరుగుతోందా? లేక డీజే ఈవెంట్‌లా మారుతోందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**పూల పండుగకు ప్రత్యేకమైన చరిత్ర**

బతుకమ్మ పండుగ అనేది కేవలం ఒక వేడుక మాత్రమే కాదు. ప్రకృతి పట్ల గౌరవం, మహిళల ఐక్యత, కుటుంబాల మధ్య అనుబంధం, గ్రామీణ జీవన సంస్కృతికి ప్రతీక. తంగేడు, గునుగు, బంతి, చామంతి వంటి వివిధ రకాల పూలతో బతుకమ్మను అందంగా పేర్చి, మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొంటారు. బతుకమ్మ పాటల్లో కుటుంబ బంధాలు, గ్రామీణ జీవనం, ప్రకృతి అందాలు, మహిళల భావోద్వేగాలు ప్రతిబింబిస్తాయి. ఈ పాటలు ఒక తరం నుంచి మరో తరానికి మన సంస్కృతిని పరిచయం చేస్తాయి.గతంలో గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగేవి. మహిళలు, యువతులు, చిన్నారులు అందరూ కలిసి సంప్రదాయ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ బతుకమ్మ ఆడేవారు. ప్రతి వీధిలోనూ బతుకమ్మ పాటల సందడి కనిపించేది. పెద్దవారు పాడే పాటలను చిన్నవారు నేర్చుకుంటూ సంప్రదాయాన్ని ముందుకు తీసుకెళ్లేవారు. అలాంటి ఆహ్లాదకరమైన వాతావరణం బతుకమ్మ పండుగకు ప్రత్యేక గుర్తింపును తెచ్చింది.

**సంప్రదాయ పాటల స్థానంలో డీజే హంగామా!**

ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో బతుకమ్మ వేడుకల నిర్వహణలో డీజేలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది. భారీ సౌండ్ బాక్స్‌లు, సినిమా పాటలు, యువత నృత్యాలు వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా మారుతున్నాయి. ఉత్సాహంగా పండుగ జరుపుకోవడం తప్పు కాదు. కొత్త తరానికి నచ్చే విధంగా కార్యక్రమాలు నిర్వహించడంలోనూ తప్పులేదు. కానీ ఆ క్రమంలో బతుకమ్మ పండుగకు ప్రత్యేకమైన సంప్రదాయ పాటలు, ఆటలు, ఆచారాలకు ప్రాధాన్యం తగ్గిపోతే మాత్రం ఆలోచించాల్సిన అవసరం ఉంది. బతుకమ్మ ఆడేందుకు ఏర్పాటు చేసిన వేదికలు కొన్ని చోట్ల డీజే కార్యక్రమాల వేదికలుగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సంప్రదాయ బతుకమ్మ పాటలు వినిపించాల్సిన చోట సినిమా పాటల హోరు పెరుగుతోందని పలువురు పేర్కొంటున్నారు. పండుగ అసలు ఉద్దేశాన్ని పక్కనపెట్టి కేవలం శబ్దాలు, హంగులు, ఆర్భాటాలకే ప్రాధాన్యం ఇస్తే భావితరాలకు బతుకమ్మ విశిష్టతను ఎలా పరిచయం చేయగలమనే ప్రశ్న తలెత్తుతోంది.

**పోటీలు, ఆర్భాటాల మధ్య అసలు లక్ష్యం మరుగున పడుతోందా?**

గ్రామాలు, పట్టణాల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు వివిధ కమిటీలు, యువజన సంఘాలు ముందుకు రావడం అభినందనీయం. పూల అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళలకు ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేయడం మంచి పరిణామం. అయితే ఎవరి వేడుక పెద్దది? ఎవరి డీజే సౌండ్ ఎక్కువ? ఎవరి కార్యక్రమానికి ఎక్కువ మంది వచ్చారు? అనే పోటీలు ప్రాధాన్యం పొందితే పండుగలోని అసలు స్ఫూర్తి వెనుకబడే ప్రమాదం ఉంది.



**పెద్దల బాధ్యత కూడా కీలకమే**

సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత కేవలం యువతపైనే ఉండదు. గ్రామ పెద్దలు, మహిళా సంఘాలు, పండుగ కమిటీలు, ప్రజాప్రతినిధులు కూడా ఇందులో కీలక పాత్ర పోషించాలి. బతుకమ్మ కార్యక్రమాల నిర్వహణలో సంప్రదాయ పాటలకు ప్రత్యేక సమయం కేటాయించడం, మహిళలందరికీ సమానంగా పాల్గొనే అవకాశం కల్పించడం, చిన్నారులకు పండుగ విశిష్టతను తెలియజేయడం వంటి చర్యలు చేపట్టాలి.

బతుకమ్మ పండుగలో మార్పు రావాలి.. కానీ సంప్రదాయం కనుమరుగుకాకూడదు!

బతుకమ్మ ఆటగా మొదలై డీజే ఈవెంట్‌గా మాత్రమే మిగిలిపోకూడదు. పూల పరిమళంతో పాటు సంప్రదాయ పాటల మాధుర్యం వినిపించాలి. ఆధునికతకు చోటివ్వాలి.. కానీ తెలంగాణ సంస్కృతికి పునాదైన సంప్రదాయాన్ని మాత్రం కాపాడుకోవాలి. అదే బతుకమ్మ పండుగకు మనం ఇచ్చే నిజమైన గౌరవం..!

రచయిత :ఎల్లే సంతోష్ కుమార్ నేత.



# మహబూబ్‌నగర్

## అక్షర కాలనీలో భక్తిశ్రద్ధలతో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్...



**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 18 (వార్తా వేదిక సూర్య):**



మహబూబ్‌నగర్‌లోని అక్షర కాలనీలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీ దుర్గాదేవి ఉత్సవ మండపంలో మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గుమ్మల మమత శ్రీనివాస్ ముదిరాజ్ ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. దుర్గామాత కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రతి ఇంటా శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని ప్రార్థించినట్లు తెలిపారు.ఓ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మక్తల్ అభివృద్ధిని అడ్డుకున్నదెవరో ప్రజలకు తెలుసు!

- పదేళ్లు అధికారంలో ఉండి పేట రోడ్డు ఎందుకు పూర్తి చేయలేదు?
- రోడ్డు పనుల ప్రారంభానికి సమయం దగ్గరపడటంతోనే చిట్టెం పాదయాత్ర..

కాంగ్రెస్ నేతల విమర్శలు..

**మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబర్ 18 (వార్తా వేదిక సూర్య):**

మక్తల్--నారాయణపేట నాలుగు లైన్ల రహదారి పనులు మరో 15 రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలోనే మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పాదయాత్ర చేపట్టారని మక్తల్ మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హనుమంతు, కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. రహదారి నిర్మాణానికి మంత్రి వాకిటి శ్రీహరి కృషి చేస్తున్న తరుణంలో రాజకీయంగా లబ్ధి పొందేందుకే పాదయాత్ర చేపట్టారని ఆరోపించారు.ఆదివారం మంత్రి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. గతంలో పదేళ్లు అధికారంలో ఉన్నప్పటికీ మక్తల్--నారాయణపేట రహదారి పనులను ఎందుకు పూర్తి చేయలేదని చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. దాదాపు 18 ఏళ్లపాటు అధికారంలో ఉన్నా అభివృద్ధి పనులు జీవోలు, కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. సంగంబండ బండరాయి తొలగింపు, ఆసుపత్రి, డయాలసిస్ కేంద్రం, డిగ్రీ కళాశాల వంటి అంశాల్లో గత పాలకులు ఆశించిన స్థాయిలో పనిచేయలేదని ఆరోపించారు.

**మంత్రి హయాంలో అభివృద్ధి పరుగులు**

మంత్రి వాకిటి శ్రీహరి మక్తల్ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సంగంబండ బండరాయి తొలగింపు పనులు చేపట్టడంతో పాటు, 150 పడకల ఆసుపత్రి ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. డయాలసిస్




కేంద్రం అందుబాటులోకి వచ్చిందని, ఆత్మకూరు--గద్వాల మధ్య వంద కోట్లకు పైగా నిధులతో వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.చిట్యాల, మంథన్‌గౌడ్, గొల్లపల్లి, మల్లేపల్లి తదితర ప్రాంతాల్లో వంతెనల నిర్మాణం పూర్తయిందని, పలు గ్రామాల్లో రహదారులు, మున్సిపాలిటీల్లో సీసీ రోడ్లు నిర్మించామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తో పాటు సుమారు రూ.1,800 కోట్ల నిధులతో మక్తల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు మంత్రి కృషి చేస్తున్నారని చెప్పారు.మక్తల్‌లోనే పుట్టి, పెరిగిన మంత్రి వాకిటి శ్రీహరి ఈ ప్రాంత అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయనకు ప్రజలు అండగా నిలవాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కట్టా సురేష్ గుప్తా, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్కూరి రవికుమార్, అమర్, వార్డు కౌన్సిలర్లు కలాల్ శ్రీవిద్య, నీల గౌడ్, జుట్ల అనిత, మార్కెట్ డైరెక్టర్ ఫయాజ్, జుట్ల శంకర్, మూర్తి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అఫ్రోజ్, అశోక్ గౌడ్, కావలి తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

# బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే ఆల..

**నిమ్స్, మెడిటెక్ ఆసుపత్రుల్లో క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా..**

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 18 (వార్తా వేదిక సూర్య):**



హైదరాబాద్‌లోని నిమ్స్, మెడిటెక్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోడ్డు ప్రమాద బాధితులను దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పరామర్శించారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డుకు చెందిన వెంకటేష్ కుమారుడిని పరామర్శించారు. అనంతరం చిన్నచింతకుంట మండలం ఉంద్యాల తండాకు చెందిన వర్న బాబు నాయక్ తండ్రిని కలిసి, శస్త్రచికిత్స అనంతరం అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు.తదుపరి పంజాగుట్టలోని మెడిటెక్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆడివి అజిలాపూర్ గ్రామానికి చెందిన రఘు, ఆయన భార్య, కుమార్తెను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎస్టీయూ**

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య)**




ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టీయూ) నాయకులు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ నివేదికను తెప్పించడంతో పాటు, హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు.ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని భవనంలో ఎస్టీయూ ప్రత్యేక కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీధర్ రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఏఐఎస్‌టీఎఫ్ ఆడిటర్ ఎం. పర్వత్ రెడ్డి మాట్లాడుతూ...., ఎస్టీయూ 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాలో నిర్వహించే వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.ఇటీవల ఇండోనేషియా రాజధాని జకార్తాలో 40 దేశాల ప్రతినిధులు పాల్గొన్న అంతర్జాతీయ విద్యా సదస్సులో పాల్గొని తిరిగి వచ్చిన ఎం. పర్వత్ రెడ్డిని నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్టీయూ శాఖ ఘనంగా సన్మానించింది.ఎస్టీయూ 80 సంవత్సరాల ఉత్సవాలను నవంబర్ 14న ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు కొత్త శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి ఎస్. మధుసూదన్ రెడ్డి ప్రకటించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధులు కె. రమేష్, డి. ప్రభాకర్, కె. రఘురాం రెడ్డి, జిల్లా నాయకులు కర్ణాకర్ రెడ్డి, సత్యనారాయణ, బాలస్వామి, హనుమంత రెడ్డి, జమీల్ అహ్మద్, మురళి, ప్రవీణ్ కుమార్, నరసింహ, వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి హరి ప్రసాద్, మండల బాధ్యులు శివశంకర్, హుస్సేన్, నారాయణ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొల్లూరులో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు

- పూల పండుగలో పాల్గొని తెలంగాణ సంస్కృతిని చాటిన ఆడబిడ్డలు..

**మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య ):**



నవాబుపేట మండలం కొల్లూరు గ్రామంలోని హైస్కూల్ ఆవరణలో సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకలకు ముగింపుగా జరిగిన ఈ పండుగలో మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మలను రంగురంగుల పూలతో అందంగా పేర్చి, ఆటపాటలతో సందడి చేశారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగలో తంగేడు, గునుగు, బంతి తదితర పూలతో బతుకమ్మలను అలంకరించి గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం ఐదు రకాల సద్దులను నైవేద్యంగా సమర్పించి, ఒకరికొకరు వాయనాలు ఇచ్చిపుచ్చుకుంటూ సోదరీభావాన్ని చాటుకున్నారు.

ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ కోలాటాలతో సందడి చేశారు. జైశ్రీరామ్ కోలాట బృందం టీం లీడర్ కృష్ణ ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి చూపరులను ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జి. యాదమ్మ, మాజీ ఎంపీటీసీ జి. కృష్ణవేణి, జంగం పల్లవి, చాకలి రజిత, దప్పు రాములమ్మ, నాగ పార్వతమ్మ, బుక్ కీపర్ ఆంజనేయులు, దొమ్మరి సత్యమ్మ, బిత్తరి యాదమ్మ, బంటు లక్ష్మి, కే. అనుష, ఎస్. శివలీల, మంగళ శివలీల, సున్నాల మాధవి, సాకలి సత్యమ్మ, రేణమ్మ రమాదేవి, చాకలి బాలమణి, ముష్టి పుష్పమ్మ, కే. సంతోషతో పాటు గ్రామ సంఘాలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.తెలంగాణ ఆడబిడ్డల ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచిన సద్దుల బతుకమ్మ వేడుకలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నింపాయి.

# రేవల్లిలో మహిళా సమైక్య భవనం, మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

- ప్రజాసేవే లక్ష్యం.. ప్రజల సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి...

**మహబూబ్ నగర్ బ్యూరో, అక్టోబర్ 18 (వార్తా వేదిక సూర్య):**



మండలంలోని రేవల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా సమైక్య భవనంతో పాటు, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి మహిళా సమైక్య భవనం ఉపయోగపడుతుందని, గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# మోకాళ్లపై కూర్చొని ఉద్యోగుల నిరసన

**డిమాండ్ల పరిష్కారానికి ఉద్యోగుల విజ్ఞప్తి**

**నాగర్ కర్నూల్ అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య)**

జాతీయ ఆరోగ్య మిషన్ (చీఎవీ) పరిధిలో వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం ఆరో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్‌లోని సమ్మె శిబిరం వద్ద చీఎవీ జాయింట్ యాక్షన్ కమిటీ (జీూజ) ఆధ్వర్యంలో ఉద్యోగులు మోకాళ్లపై కూర్చొని వినూత్న రీతిలో శాంతియుత నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులు మంజూరు చేయడంతోపాటు 180 రోజుల ప్రసూతి సెలవులు కల్పించాలని, ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చీఎవీ జీూజ జిల్లా అధ్యక్షుడు డా. బాలకృష్ణ, జనరల్ సెక్రటరీ దామగట్ల కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌస్ బాషా, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ డా. జగన్, కల్చరల్ సెక్రటరీ డా. రామకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ భీముడు, కోశాధికారి ప్రవీణ్‌తో పాటు పలువురు చీఎవీ ఉద్యోగులు పాల్గొన్నారు.



వార్త వేదిక సూర్య
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY
సంపుటి : 2, సంచిక : 151 || సోమవారం || అక్టోబర్ 19, 2026



# పెద్దపల్లి



## దుర్గామాత అమ్మవారి దీవెనలు అందరిపై ఉండాలి

- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**మంథని, అక్టోబర్ -18, (వార్త వేదిక సూర్య):**

మంథని నియోజకవర్గం కమాన్ పూర్ మండలంలో మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదివారం కమాన్ పూర్, గుండారం, పెరపల్లి గ్రామాల్లో పర్యటించి, దుర్గామాత అమ్మవార్లను దర్శించుకున్నారు. వివరాల్లోకి వెళ్ళితే కమాన్ పూర్ మండలకేంద్రంలోని బాపూజీ నగర్ లో తోట వీరయ్య ఆధ్వర్యంలో ప్రతిష్టించిన అమ్మవారిని, గుండారం గ్రామంలో భవాని యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన అమ్మవారిని, మరియు రాజేందర్ నగర్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన అమ్మవారిని, పెరపల్లి గ్రామంలో శ్రీ భవాని యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన అమ్మవారిని, మరియు కనకదుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన అమ్మవారిని, కమాన్ పూర్ కిష్టంపల్లె హనుమాన్ టెంపుల్ లో ప్రతిష్టించిన అమ్మవారిని, కమాన్ పూర్ సుభాష్ నగర్ లో సుభాష్ యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన అమ్మవారిని, మరియు కమాన్ పూర్ బస్టాండ్ వద్ద ఛత్రపతి శివాజీ యువసేన వారి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన అమ్మవారిని, మరియు కమాన్ పూర్ బస్ స్టాండ్ లో రానవేణి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన అమ్మ వార్లను దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ మంథని నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గారి వెంట కమాన్ పూర్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పలువురు పాల్గొన్నారు.

## మంథని డిపోలో వైభవంగా దుర్గామాత పూజ

**నవరాత్రి వేడుకల్లో పాల్గొన్న డిపో కార్మికులు**



**మంథని, అక్టోబర్ -18: (వార్త వేదిక సూర్య )**

మంథని ఆర్టీసీ డిపోలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దుర్గామాత పూజను ఘనంగా నిర్వహించారు. డిపో కార్మికుల సహకారంతో ప్రతి ఏటా డిపో ప్రాంగణంలోని దుర్గామాత ఆలయం వద్ద నిర్వహించే ఈ పూజా కార్యక్రమంలో భారీ సంఖ్యలో కార్మికులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ జ్ఞానేశ్వర్, ఎస్టీఐ వర్జిలాల్, ఏఎంఎఫ్ వెంకటేశ్వర్లు, తెలంగాణ మజ్దూర్ యూనియన్ డిపో ప్రధాన కార్యదర్శి కేకే రెడ్డి, మునీర్, రమేష్, గ్యారేజ్ సెక్రటరీ కృష్ణ, శ్రీనివాస్, విజయ్, మెకానిక్ విజయ్, కుమార్, ఎంప్లాయీస్ యూనియన్ సెక్రటరీ గంధం రమేష్, రాజబాబు, సెక్యూరిటీ కానిస్టేబుల్ రాకేష్, నంది సాగర్, మంత్రి పోచయ్య, వెంకటస్వామి, సతీష్, ఏడీసీలు ఎన్. అంజయ్య, ఎం. రాములు తదితరులు పాల్గొన్నారు.

# మంథనిలో గార్మెంట్ ఫ్యాక్టరీకి అడుగులు

- డిసెంబరులో ప్రారంభం..
- 400 మందికి ఉపాధి అవకాశలు
- నవంబర్ 1 నుంచి మహిళలకు ఉచిత శిక్షణ
- ఐటి మంత్రి దుద్దిల్లా శ్రీధర్‌బాబు

**మంథని, అక్టోబర్ 18, (వార్త వేదిక సూర్య):**

మంథని ప్రాంత నిరుద్యోగులకు, మహిళలకు స్థానికంగానే ఉపాధి కల్పించే లక్ష్యంతో పట్టణంలో గార్మెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. డిసెంబరులో ఫ్యాక్టరీ ప్రారంభించి 300 నుంచి 400 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, నవంబర్ 1 నుంచి ఎంపిక చేసిన వారికి ఉచిత శిక్షణ అందిస్తామని వెల్లడించారు. ఆదివారం మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అలీఫ్, డీఆర్‌డీఏ, మెప్మా, సీఎస్‌ఆర్ సంస్థల సహకారంతో కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు మంత్రి ధ్రువపత్రాలు అందజేశారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 3,040 మందికి ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మహిళలు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అనంతరం 302 మంది సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు సుమారు రూ.కోటి విలువైన చెక్కులను పంపిణీ చేశారు. మహిళలు సమూహాలుగా ఏర్పడి పాడి పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని మంత్రి కోరారు. ఆసక్తి ఉన్నవారికి ములుగునూరు డెయిరీలో శిక్షణ ఇప్పించి, జనవరి నుంచి డెయిరీ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని ప్రజలకు సూచించారు. నీటి కొరత నివారణకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. నియోజకవర్గంలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణంతో పాటు ఇతర అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు వివరించారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.







### రామగిరి ఖిల్లా పర్యాటక అభివృద్ధికి

# వాకింగ్, ట్రెక్కింగ్ కార్యక్రమాలు దోహదం

- ఏసీపీ మడత రమేష్‌లి
- ఉత్సాహంగా సాగిన 17 కిలోమీటర్ల వాకింగ్, ట్రెక్కింగ్ కార్యక్రమం
- మన జిల్లా -- మన రామగిరి కార్యక్రమంతో చారిత్రక రామగిరి ఖిల్లాకు మరింత గుర్తింపు

**మంథని,అక్టోబర్ -18, (వార్త వేదిక సూర్య):**

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు నిర్వహించిన మన జిల్లా --మన రామగిరి కార్యక్రమంలో భాగంగా రామగిరి ఖిల్లా వద్ద నిర్వహించిన వాకింగ్, ట్రెక్కింగ్ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగిందని ఏసీపీ మడత రమేష్ తెలిపారు. జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లిఏసీపీ మడత రమేష్ మాట్లాడుతూ,లి చారిత్రక ప్రాధాన్యత కలిగిన రామగిరి ఖిల్లా విశిష్టతను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, ఈ ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ప్రకృతి అందాలు, చారిత్రక కట్టడాలతో ప్రత్యేకత కలిగిన రామగిరి ఖిల్లా పర్యాటకులను ఆకర్షించే సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు.

యువత, ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా వాకింగ్, ట్రెక్కింగ్ కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా రామగిరి ఖిల్లాపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతుందని తెలిపారు.

ఇటువంటి కార్యక్రమాలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు, చారిత్రక వారసత్వ పరిరక్షణపై అవగాహన కల్పిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 100 నుంచి 150 మంది వాకర్స్, ట్రెక్కర్స్ ఉత్సాహంగా పాల్గొని, జోష్‌తో సుమారు 17 కిలోమీటర్ల మేర వాకింగ్, ట్రెక్కింగ్ పూర్తి చేశారు. పాల్గొన్న వారిలో కనిపించిన ఉత్సాహం, ప్రకృతి పట్ల ఆసక్తి కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రామగిరి ఖిల్లా పర్యాటక అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, చారిత్రక ప్రదేశాల విశిష్టతను విస్తృతంగా ప్రచారం చేయడం ద్వారా పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఏసీపీ మడత రమేష్ తెలిపారు. ట్రెక్కింగ్ అనంతరం నిర్వాహకులు మహిపాల్ రెడ్డి ట్రెక్కింగ్ పూర్తిచేసిన అభ్యర్థులకు మెడల్స్ ప్రధానం చేశారు మెడల్స్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, నిర్వాహకులు మైపాల్ రెడ్డి, సెక్షన్ పర్యవేక్షకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు.






# దుద్దిళ్ల బ్రదర్స్‌కు ప్రజల మనోభావాలకంటే మట్టి దోపిడీపైనే శ్రద్ధ

- మూడేళ్లయినా తమ్మచెరువు సుందరీకరణకు తట్టెడు మట్టి పోయలే
- నాలుగు నాలుగు సార్లు మంత్రి పదవి ఇచ్చానా నాలుగు పనులు చేయలే
- కమీషన్‌లు ఇస్తున్నరు కనుకనే రోడ్ల పనులకు అంత ప్రాముఖ్యత ఇస్తుండ్లు
- కమీషన్‌ల కోసం కోట్ల రూపాయల పనులను ద్వంసం చేస్తుండ్లు

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

**మంథని, అక్టోబర్ -18,(వార్త వేదిక సూర్య):**



మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఆయన సోదరుడికి మట్టి దోపకంపై ఉన్న శ్రద్ధ నియోజకవర్గ ప్రజల మనోభావాలు, ఆకలి మీద లేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ విమర్శించారు. ఆదివారం మంథని పట్టణంలోని తమ్మిచెరువును సందర్శించిన ఆయన మీడియాతో మాట్లాడారు. అనేక ఏండ్లుగా మన పూర్వీకుల కాలం నుంచి తమ్మి చెరువులో బతుకమ్మలను ఆంపే ఆనవాయితీ ఉండేదని తెలిపారు. ఈ చెరువును ఆనాడు తాము సుందరీకరణ చేశామని, అయితే పనులు ఎక్కడైతే ఆగిపోయాయోమూడేళ్లు అయినా పనులు అక్కడే ఉన్నాయని, సారుకు మంత్రి పదవి వచ్చినా తట్టెడు మట్టి పోయలేదని ఎద్దేవా చేశారు. తాము ఏనాడు ఓట్ల కోసం రాజకీయం కోసం మాట్లాడమని తమ మాటలకు తమ్మిచెరువు నిలువెత్తు సాక్ష్యమని చెప్పారు. ఆనాడు తమ్మి చెరువును అద్భుతంగా తీర్చిదిద్ది బోటింగ్, స్నాక్స్ పాయింట్, రింగ్‌రోడ్‌ను ప్రతిపాదన చేశామని, 70శాతం పనులు పూర్తి కాగా ప్రభుత్వం మారిపోవడంతో అక్కడే ఆగిపోయాయని , మూడేళ్లయినా ముందుకు సాగలేదని విమర్శించారు. ఈనాడు కమీషన్‌ల కోసం రోడ్లు చేస్తున్నారని, ఈ చెరువు పనులకు కమీషన్‌లు ముట్టకపోవడంతోనే పనులు చేస్తలేరని బావిస్తున్నట్లు చెప్పారు. ఒకవేళ కమీషన్‌లు ముట్టితే ఎన్నికలకు ముందు చేస్తారు కావచ్చని అన్నారు. మంథనిలో ఉన్న చెరువుల్లో కావాలనే మట్టి తీసి పెద్దగా ఉన్న చెరువులను చిన్నగా చేశారని, ఇందుకు రావుల చెరువు నిదర్శనమన్నారు. మంథనిలో గొప్పగా అభివృద్ధి జరుగుతాందని వచ్చి పోయేటోళ్లు అనుకునేలా రోడ్ల పనులు చేస్తున్నరే తప్ప చదువుకున్న యువకులు, మహిళల కోసం దుద్దళ్ల శ్రీధర్ ఆలోచన చేయడం లేదన్నారు. తమ్మిచెరువుకు ఒక ప్రత్యేక ఉందని, అనేక జీవరాశులు ఇక్కడే ఉంటాయని, సాయంకాలం అనేక మంది సేద తీరుతూ ప్రకృతిని తిలకిస్తుంటారని, అలాంటి వారికి నిరాశే మిగిలిందన్నారు. ఓట్లప్పుడే పనులు చేస్తమనుకోవడం మంచి పద్దతి కాదని హితవు పలికారు. 40ఏండ్లుగా అధికారం ఇస్తూ నాలుగు నాలుగు సార్లు మంత్రి పదవులు ఇప్పిస్తే నాలుగు పనులు చేయకపోవడం సిగ్గు చేటు అన్నారు. ఏదో పెద్దస్థాయిలో ఉన్నారని మంచిగా అభివృద్ధి చేస్తరనే మున్సిపాలిటిని పెద్ద మెజార్టీతో అప్పజెప్తే పాలకవర్గం కూడా ఏమీ చేయడంలేదని, నాయకత్వం లాగే పాలకవర్గ కూడా వ్యవహరిస్తోందని, వాళ్లు మట్టి దోపిడి చేస్తుంటే పాలకవర్గం చెత్త దోపిడి చేస్తోందని ఆరోపించారు. ప్రజల పక్షాల ప్రతి సమస్యను దృష్టికి తీసుకువస్తామని, తమపై తన కుటుంబం గురించి మాట్లాడితే మేము మీ కుటుంబం మీద మాట్లాడుతామని, ఎస్సీ ఎస్టీ వాళ్లతో తిట్టిపిస్తూ భయభ్రాంతులకు గురి చేసినా ఆగమన్నారు. తమ్మిచెరువు వద్ద బతుకమ్మ ఘాట్‌లు ఏర్పాటు చేసి బోటింగ్ పెట్టాలని ఆలోచన చేశామని, కానీ మూడేళ్లుగా మీరేం చేశారో జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. రోడ్ల పనులకు కమీషన్‌లు ఇస్తున్నరు కనుకనే ఆ పనులకే ప్రాముఖ్యత ఉందని, కమీషన్‌ల కోసం ఎన్ని ద్వంసం చేస్తన్నరో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. మంథని రామగుండం రోడ్డు విస్తరణ ఉందని తెలిసినా ఆనాడు లైట్లు ఏర్పాటు చేశారని, ఈనాడు మళ్లీ విస్తరణ పేరుతో ఆ లైట్లను తొలగించారని అన్నారు. ఈ లైట్ల ఏర్పాటుకు కోట్ల రూపాయలు వెచ్చించారని, కమీషన్‌ల కోసం లైట్లు వేసిండ్లు కమీషన్‌లు ముట్టినంక లైట్లు తీసేసిండ్లని, మళ్లీ కొత్త లైట్ల కోసం కమీషన్‌లు తీసుకుంటారని ఆయన అన్నారు. మీ నాయకుడిని నమ్మి ప్రజలు అవకాశం ఇస్తే మూడేళ్లయినా తమ్మి చెరువు గురించి ఆలోచన చేయలేదని, అయ్యగారి చెరువుకు సుందరీకరణ ఎందుకో సమాధానం చెప్పాలన్నారు. మూడేళ్లుగా తమ్మిచెరువు చీకటిగా ఉండటం సమాజానికే అవమానమని ఆయన అన్నారు. ఇప్పటికైనా మంథని ఎమ్మెల్యే కళ్లు తెరిచి మంథని ప్రజల మనోభావాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.





# రంగారెడ్డి

# మైనారిటీల సంక్షేమానికి పెద్దపీట వేయాలి

## దేవరకొండ నియోజకవర్గంలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.2.25 కోట్ల నిధులు మంజూరు చేయాలని మంత్రి అజారుద్దీన్‌ను కోరిన ఎమ్మెల్యే బాలునాయక్



**దేవరకొండ, అక్టోబర్ 18 ( వార్తా వేదిక సూర్య):-**

దేవరకొండ నియోజకవర్గంలోని ముస్లిం, క్రైస్తవ మైనారిటీల సామాజిక, సాంస్కృతిక అవసరాలను తీర్చేందుకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆదివారం మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు

**నాలుగు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు**

దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని ముస్లిం మైనారిటీల కోసం దేవరకొండ, చింతపల్లి, డిండి ప్రాంతాల్లో ఒక్కో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.50 లక్షల చొప్పున మొత్తం రూ.1.50 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా దేవరకొండలో క్రైస్తవ మైనారిటీల కోసం ప్రత్యేక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.75 లక్షలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నాలుగు నిర్మాణాలకు కలిపి మొత్తం రూ.2.25 కోట్ల నిధులు అవసరమవుతాయని వివరించారు

మైనారిటీ వర్గాల ప్రజలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడానికి, విద్యా సంబంధిత కార్యక్రమాలు నిర్వహించడానికి కమ్యూనిటీ హాళ్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎమ్మెల్యే బాలునాయక్ పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో తగిన వసతులు కల్పించడం ద్వారా మైనారిటీ వర్గాల అభివృద్ధికి మరింత తోడ్పాటు అందించవచ్చని వివరించారు. దేవరకొండ నియోజకవర్గంలోని మైనారిటీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిపాదిత కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి అవసరమైన నిధులను మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా త్వరితగతిన మంజూరు చేసి, నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌ను దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ కోరారు



## ఘనంగా బిచ్చు సంఘివీర్ జన్మదిన వేడుకలు

**సికింద్రాబాద్, అక్టోబర్ 18(వార్త వేదిక సూర్య)**

బిచ్చు సంఘివీర్ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని పలువురు నాయకులు, ప్రముఖులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇలాంటి జన్మదిన వేడుకలు మరి ఇంకా ఎన్నో జరుపుకోవాలని ఆ యొక్క భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో పోకల నాగేందర్, మంద మురళి, సురేష్ రావు, లింగమయ్య యాదవ్, బాలకృష్ణ గౌడ్, అంజయ్య, సుధాకర్ రావు, కాసుల సురేందర్ రావు, మడిపల్లి శంకర్, నరసింహ గౌడ్, సత్యనారాయణ, వి.ఎస్. రాజు తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

### చౌదర్‌పల్లి గేటు సమీపంలో ప్రమాదం.. తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి

**యాచారం, అక్టోబర్ 18 (వార్త వేదిక సూర్య):**



ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మేడిపల్లి గ్రామానికి చెందిన కొంగళ్ల పద్మ (45) తన భర్త మల్లేష్‌తో కలిసి బంతిపూలు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరిగి వెళ్తున్నారు.

ఈ క్రమంలో చౌదర్‌పల్లి గేటు సమీపంలోని పెట్రోల్ బంకు వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో పద్మ రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కిరాణం షాప్ ను ప్రారంభించిన బి.ఆర్.ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్

**కొండమల్లేపల్లి అక్టోబర్ 18(వార్త వేదిక సూర్య):-**



కొండమల్లెపల్లి మండలం వడ్త్య తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల కారోభరి తండా లో నేనావత్ వినోద్ కిరాణ షాప్ ను బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గం నాయకులు వడ్త్య రమేష్ ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు

ఈ కార్యక్రమంలో వడ్త్య తండా గ్రామ సర్పంచ్ నేనావత్ సర్దార్ నాయక్, మాజీ సర్పంచ్ వడ్త్య బలరాం నాయక్, లాలూ నాయక్, రవీందర్, వినోద్, దీప్ల, మల్లేష్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# దేవరకొండలో దిగజారిన రాజకీయాలు



## బి ఆర్ ఎస్ నాయకుడు నేనావత్ కిషన్ నాయక్ ఫ్లెక్సీల తొలగింపును తీవ్రంగా ఖండిస్తున్నాం!

**దేవరకొండ అక్టోబర్ 18 ( వార్త వేదిక సూర్య ):-**

విజయదశమి (దసరా) పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ దేవరకొండ ప్రజల కోసం బి .ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ గారు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను అధికార పార్టీ తొలగించడాన్ని తీవ్రంగా నిరసిస్తున్నాము

దేవరకొండ నియోజకవర్గంలో బి ఆర్ ఎస్ పార్టీకి పెరుగుతున్న ప్రజాదరణ, కిషన్ నాయక్ గారికి లభిస్తున్న ప్రజా మద్దతును చూసి తట్టుకోలేకే అధికార పార్టీ ఇలాంటి నీచమైన, చిల్లర రాజకీయాలకు ఒడిగడుతున్నారు

**అభివృద్ధి చేతకాక కక్షసాధింపు చర్యలు!**

